www.vaarthavedhikasurya.com

RNI NO: TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

విలేకరులు కావలెను:

వార్త వేదిక సూర్య దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణలోని ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పనిచేయుటకు రిపోర్టర్లు కావలెను.

యాదాద్రి భువనగిరి: యాదగిరిగుట్ట, యాదగిరిగుట్ట టౌన్, యాదగిరిగుట్ట రూరల్, బొమ్మలరామారం, గుండాల, అడ్డగూడూరు, ఆలేరు, భువనగిరి, భువనగిరి రూరల్, బీబీనగర్, తిరుమలగిరి, స్వర్ణగిరి దేవాలయం, రాజాపేట మండలాల విలేకర్లు కావలెను.

నల్లగొండ : చిట్యాల, నార్కట్‌పల్లి, కనగల్, తిప్పర్తి, మిర్యాలగూడ, మిర్యాలగూడ రూరల్, మాల్, మర్రిగూడెం, చింతపల్లి, గుర్రంపోడు, కోదాడ, సూర్యాపేట, నకిరేకల్, కట్టంగూర్, హుజూర్‌నగర్, మఠంపల్లి, త్రిపురారం, చందంపేట, దిండి మండలాలలో రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

పూర్తి వివరాలకు సంప్రదించగలరు.

పోలోజు శ్రీనివాసాచారి
చైర్మన్ & ఎడిటర్.
9985389183

యాదాద్రి భువనగిరి | మంగళవారం 22, జులై 2025 | ఎడిటర్ : పోలోజు శ్రీనివాసాచారి | సంపుటి : 01 | సంచిక: 279 | పేజీలు: 08 | వెల: 5/

## మేడిన్ ఇండియా ఆయుధాల వైపు
# ప్రపంచం చూపు..

- విజయోత్సవ వేళ పార్లమెంట్ సమావేశాలు
- ఉగ్రవాదం, నక్సలిజం నుంచి విముక్తి
- ఆపరేషన్ సిందూర్‌తో పాక్ ఉగ్రమూకల ధ్వంసం
- మన సైనిక శక్తిని ప్రపంచం గుర్తించింది
- అంతరిక్షంలో త్రివరణ పతాకం ఎగరేసిన శుభాంశు శుక్లా
- పార్లమెంట్ ముందు మీడియాతో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,జూలై21(వార్త వేదిక సూర్య): స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి భారతదేశం ఉగ్రవాదం, నక్సలిజం వంటి సమస్యలను ఎదుర్కొం టోందని ప్రధాని మోడీ అన్నారు. నేడు నక్సలిజం, మావోయిజం ప్రభావం వేగంగా తగ్గుతోందని చెప్పారు. దేశ భద్రతా దళాలు ఉత్సాహంతో విజయం వైపు పయ నిస్తున్నాయని, వందలాది జిల్లాలు నక్సలిజం ప్రభావం నుంచి విముక్తి పొందాయని ఆయన తెలిపారు. గతంలో రెడ్ కారిడార్‌గా పిలిచే ప్రాంతాలు ఇప్పుడు గ్రీన్ జోన్‌లుగా మారుతున్నాయని, ఇది దేశ ఉజ్వల భవిష్యత్తుకు నిదర్శనమని ఆయన అన్నారు. బాంబులు, తుపాకుల ముందు భారత రాజ్యాంగం విజయం సాధిస్తోందని ఆయన ఉద్ఘాటించారు. దేశ భద్రత, సైనిక శక్తి, ఆర్థిక వ్యవస్థ, సైన్స్ అండ్ టెక్నాలజీ, వ్యవసాయ రంగంలో జరుగుతున్న అభివృద్ధిని గురించి ఆయన మాట్లాడారు. పార్లమెట్ సమావేశాలను పురస్కరించు కుని ఆయన పార్లమెంట్ ముందు మిడియాతో మాట్లాడారు. వర్షాకాలం సమావేశాలకు మీ అందరికీ స్వాగతం అని ప్రధాన మంత్రి మోదీ అన్నారు. ఈ సమావేశం దేశానికి గర్వకారణమైన విజయోత్సవంగా ఆయన అభివర్ణించారు. మోదీ తన ప్రసంగంలో దేశం ఎదుర్కొంటున్న హింసాత్మక ఘటనల గురించి మాట్లాడారు. ప్రధాని మోదీ భారత సైనిక శక్తి గురించి మాట్లాడుతూ, దేశం సైనిక రంగంలో గొప్ప పురోగతి సాధిస్తోందని తెలిపారు. సైనిక రంగంలో పరిశోధన, తయారీ, మేక్ ఇన్ ఇండియా ఆయుధాల ఉత్పత్తి బలపడుతోందన్నారు. ఇది యువతకు కొత్త ఉపాధి అవకాశాలను సృష్టిస్తోందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఆపరేషన్ సిందూర్‌లో భారత సైన్యం 100 శాతం లక్ష్యాలను సాధించిందని, కేవలం 22 నిమిషాల్లోనే శుత్రువుల ఇళ్లలోకి వెళ్లి వారి స్థావరాలను నాశనం చేసిందని పేర్కొన్నారు. ఈ విజయం దేశానికి గర్వ కారణమని మోదీ అన్నారు. సైన్స్, టెక్నాలజీ రంగంలో భారతదేశం సాధిస్తున్న విజయాల గురించి మోదీ మాట్లాడారు. ఈ రంగంలో దేశం కొత్త ఉత్సాహంతో ముందుకు సాగుతోందని, అంతరిక్ష రంగంలో భారత్ కొత్త శిఖరాలను అధిరోహిస్తోందని ఆయన తెలిపారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో భారత త్రివర్ణ పతాకం ఎగిరిన సందర్భాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ క్షణం దేశ ప్రజలందరికీ గర్వకారణమని, పార్లమెంట్ లోక్‌సభ, రాజ్యసభ రెండూ

మిగతా 2లో..



## లోక్‌సభలో గొంతు నొక్కారు

- మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదు
- ఏక పక్షంగా సమావేశాలు తీరు
- విపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపణ



న్యూఢిల్లీ,జూలై21(వార్త వేదిక సూర్య): లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఉన్న తనకు లోక్‌సభ సమావేశాల్లో మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. పార్లమెంట్ సమావేశాల్లో అధికార పక్షం సభ్యులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

మిగతా 2లో..



## భారీ వర్షాల నేపథ్యంలో
# అప్రమత్తంగా ఉండండి

- ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలి
- అధికారులు క్షేత్రస్తాయిలో పర్యవేక్షించాలి
- హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడండి
- అంటువ్యాధులు ప్రబలకుండా గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి
- యూరియా కొరత లేకున్నా కొందరు అసత్య ప్రచారాలు
- 25 నుంచికొత్త రేషన్ కార్డుల పంపిణీకి చర్యలు
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్,జూలై21(వార్త వేదిక సూర్య): భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్లను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులను అప్రమత్తం చేయాలని వారికి సూచించారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో అన్ని జిల్లాల కలెక్టర్లతో సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జూన్ నుంచి ఇప్పటి వరకు 21 శాతం వర్షపాతం నమోదు అయ్యిందని.. ఇది తక్కువ వర్షపాతమని సీఎం పేర్కొన్నారు. అయితే గత మూడు రోజులుగా భారీ

మిగతా 2లో..

## 42శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ మోసం

- సాధ్యం కాదని తెలిసీ బీసీ ఓట్ల రాజకీయం
- రిజర్వేషన్లను తొమ్మిదో షెడ్యూల్‌లో ఎలా పెడతారు
- ఢిల్లీలో మీడియా సమావేశంలో బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు



న్యూఢిల్లీ,జూలై21(వార్త వేదిక సూర్య): బీసీ రిజర్వేషన్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం, భాజపాపై నిందలు వేస్తే ఊరుకోబోమని ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు రామచంద్రరావు అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని మోసం చేశారని.. సాధ్యం కాదని తెలిసినా బిల్లు తీసుకొచ్చారని విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధ్యం కాదని తెలిసినా.. ఓటు బ్యాంకు పాలిటిక్స్ కోసం మోసం చేస్తున్నారని మండిపడ్డారు. దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో రామచంద్రరావు మాట్లాడారు. అసాధ్యమైన పనిని కేంద్రంపైకి నెట్టివేస్తున్నారన్నారు. భాజపా, కేంద్ర ప్రభుత్వంపై నిందలు వస్తే

మిగతా 2లో..

## ఆపరేషన్ సిందూర్‌పై
# చర్చించాలి



- ట్రంప్ వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలి
- రాజ్యసభలో విపక్షనేత ఖర్గే డిమాండ్

న్యూఢిల్లీ,జూలై21(వార్త వేదిక సూర్య): వర్షాకాల పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఉభయ సభల కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే ఇటీవలి

మిగతా 2లో..

## పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం

**లోక్‌సభలో నినాదాలతో తొలిరోజు వాయిదా**

**రాజ్యసభలో నలుగురు కొత్త సభ్యుల ప్రమాణం**

న్యూఢిల్లీ,జూలై21 (వార్త వేదిక సూర్య): పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 11 గంటలకు లోక్‌సభ, రాజ్యసభ సమావేశమయ్యాయి. తొలుత పహల్గాం ఉగ్రదాడి, ఎయిరిండియా విమాన ప్రమాద మృతులకు ఉభయ సభలు నివాళులర్పించాయి. రాజ్యసభలో కొత్తగా ఎంపికైన నలుగురు ఎంపీలు ప్రమాణస్వీకారం చేశారు. అటు లోక్‌సభలో విపక్షాలు నిరసనకు దిగాయి. ఆపరేషన్ సిందూర్'తో పాటు పలు అంశాలపై చర్చకు పట్టుబడుతూ లోక్‌సభలో విపక్షాలు ఆందోళన చేపట్టాయి. తామిచ్చిన వాయిదా తీర్మానాలపై చర్చించాలని పట్టుబట్టాయి.

మిగతా 2లో..

## చీదరించుకునేలా
# రాజకీయ నేతల భాష

- హుందాగా మాట్లాడడం నేర్చుకోవాలి
- అభివృద్ధిని దెబ్బతీస్తున్న ఉచిత పథకాలు
- మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



నల్లగొండ,జూలై21(వార్త వేదిక సూర్య): రాజకీయ నాయకులు మాట్లాడే భాష వింటున్న ప్రజలు చీదరించు కుంటున్నారని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. రాజకీయాల్లో భాషా వ్యవహారం పూర్తిగా దిగజారిందని అసహనం వ్యక్తం చేశారు. ప్రతి నాయకుడు ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా నాయకులు మాట్లాడే భాష మార్చుకోవాలని సూచించారు. తద్వారా తమ గౌరవాన్ని నిలుపుకోవాలని చెప్పారు. నల్లగొండలోని తన క్యాంప్ కార్యాలయంలో గుత్తా మిడియాతో మాట్లాడారు. నాయకులు ఇప్పటికైనా తమ భాషను మార్చుకోవాలన్నారు. ఇటీవలి కాలంలో రాజకీయ నాయకులు మాట్లాడే భాషపై గుత్తా సుఖేందర్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో భాషా వ్యవహారం పూర్తిగా దిగజారిందని, ప్రతి నాయకుడు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. పార్టీలకు అతీతంగా రాజకీయ నాయకులు మాట్లాడే భాష మార్చుకోవాలని, మాటల ద్వారా గౌరవాన్ని నిలుపు కోవాలని సూచించారు. నాయకులు మాట్లాడే భాష వింటున్న ప్రజలు చీదరించుకుంటున్నారని, అందువల్ల నాయకులు భాష మార్చుకోవాలని గుత్తా సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు. మీడియా సమావేశంలో రాజకీయ నాయకుల భాషపై మాత్రమే కాదు ఉచిత పథకాలు, అవినీతి, బనకచర్ల ప్రాజెక్టు, సాగర్ ఎడమ కాలువ లాంటి తదితర విషయాలపై స్పందించారు. ఉచిత పథకాలు రాష్ట్ర, దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్నాయి. ఉచితాలను నియంత్రించాల్సిన అవసరం ఉంది. లేకపోతే

మిగతా 2లో..




## స్థానిక ఎన్నికల్లో
# సత్తా చాటుతాం..

- ఎన్నికలు ఎప్పుడు జరిగినా విజయం మాదే
- మీడియాతో మాజీమంత్రి హరీష్ రావు

సిద్దిపేట,జూలై21(వార్త వేదిక సూర్య): స్థానిక ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేస్తామని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ధీమా వ్యక్తం చేశారు. ఎప్పుడు ఎన్నికలు జరగినా బిఆర్‌ఎస్‌దే విజయమని అన్నారు. కాంగ్రెస్ 20 నెలల పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు. స్థానిక ఎన్నికలపై ఈ మధ్య సర్వే చేయిస్తే.. తెలంగాణలో మొత్తం 31 జిల్లా పరిషత్‌లు ఉంటే.. 16 నుంచి 18 స్థానాలని బీఆర్‌ఎస్ కైవసం చేసుకోబోతోందని ఆ సర్వేలో తేలిందని తెలిపారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌ని ఓడించాలని పిలుపునిచ్చారు. సోమవారం ప్రజ్ఞాపూర్‌లో గజ్వేల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ముఖ్య నాయకుల సమావేశం

మిగతా 2లో..




## బెట్టింగ్ యాప్ కేసు
# దర్యాప్తు ముమ్మరం

- రానా,విజయ్ దేవరకొండ,ప్రకాశ్ రాజ్, మంచు లక్ష్మిలకు నోటీసులు
- విచారణకు రావాలని ఆదేశించి ఈడి

హైదరాబాద్,జూలై21(వార్త వేదిక సూర్య): బెట్టింగ్ యాప్ కేసులో ఈడీ అధికారులు సినీ సెలబ్రిటీలకు షాక్ ఇచ్చారు. ఈ కేసులో ముమ్మరంగా విచారణ చేస్తున్న క్రమంలో బెట్టింగ్ యాప్ కేసులో నిందితులుగా ఉన్న సినీ సెలబ్రెటీలకు సోమవారం నోటీసులు జారీ చేశారు. ఇప్పటికే పలువురిని పోలీసులు విచారించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో దగ్గుబాటి రానా, ప్రకాష్‌రాజ్, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మీప్రసన్న విచారణకి హాజరవ్వాలని ఈడీ అధికారులు నోటీసులు పంపించారు. జులై 23న దగ్గుబాటి రానా, జులై30న ప్రకాష్‌రాజ్, ఆగస్ట్6న విజయ్ దేవరకొండ, ఆగస్ట్ 13న మంచు లక్ష్మీప్రసన్న

మిగతా 2లో..



## కేరళ మాజీ సీఎం విఎస్. అచ్యుతానందన్ కన్నుమూత

- 101 ఏళ్ల వయసులో గుండెపోటుతో మృతి
- సిపిఎ ఏర్పాటు, ఉద్యమాల్లో కీలక భూమిక
- భూస్వాములపై పోరాటంలో అలుపెరుగని నేతగా గుర్తింపు

తిరువనంతపురం,జూలై21(వార్త వేదిక సూర్య): కమ్యూనిస్టు కురువృద్ధుడు, కేరళ మాజీ ముఖ్యమంత్రి వి.ఎస్.అచ్యుతానందన్ (101) కన్నుమూశారు. గత నెల 23న గుండెపోటుతో ఓ ప్రైవేటుఆస్పత్రిలో చేరగా.. ఆయన ఆరోగ్య పరిస్థితి మరింతగా క్షీణించడంతో సోమవారం తుదిశ్వాస విడిచారు. 2006 నుంచి 2011 వరకు ఆయన కేరళకు సీఎంగా పనిచేసారు. అవిభక్త వామపక్ష పార్టీలో చీలిక తర్వాత సీపీఎంను స్థాపించిన వ్యక్తుల్లో అచ్యుతానందన్ కూడా ఒకరు. 1923 అక్టోబరు 20న కేరళలో వెనకబడిన ఓ నిరుపేద కుటుంబంలో జన్మించిన

మిగతా 2లో..

## లిక్కర్ మాఫియా గుప్పిట్లో ప్రభుత్వం

- కల్లు కాంపౌడ్‌లను ఎత్తేసే కుట్ర
- కులవృత్తులను అగౌరవపరుస్తున్న కాంగ్రెస్
- మండిపడ్డ మాజీమంత్రి శ్రీనివాసగౌడ్

హైదరాబాద్,జూలై21(వార్త వేదిక సూర్య): కుల వృత్తులను కాపాడుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు వాటిని నాశనం చేయాలని చూస్తుందని మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఏ కుల వృత్తిపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. ఆదాయం వచ్చే కుల వృత్తులను ప్రభుత్వం నాశనం చేయాలని చూస్తోందన్నారు. గీత కార్మికులకు ఐదు ఎకరాల పొలం ఇస్తామని చెప్పారు. గీత కార్మికులు చెట్లపై నుంచి పడి చనిపోతే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తామని ప్రభుత్వం చెప్పింది. లిక్కర్ మాఫియాకు తలొగ్గి కల్లుగీత వృత్తిని బంద్ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. కల్లు కంపౌండ్ ద్వారా పది కులాలు బ్రతుకుతున్నాయి. ఉప్పల్‌లో తాటి చెట్లు కొట్టి గీత కార్మికులకు నష్టం చేశారు. కల్లు కంపౌండ్‌ను నిషేధిస్తామని ప్రభుత్వం లీకులు ఇస్తోంది. లిక్కర్ కంపెనీలు, డిస్టలరీలన్ని ఒకరిద్దరి చేతుల్లో నడుస్తున్నాయి. లిక్కర్ కంపెనీల

మిగతా 2లో..



## విదేశీ మీడియా తప్పుడు ప్రచారాలు నమ్మవద్దు

- నిష్పక్షపాతంగా అహ్మదాబాద్ విమాన ప్రమాద దర్యాప్తు
- తుది నివేదికలో పూర్తి వివరాలు వెల్లడవుతాయి
- లోక్‌సభలో మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి



న్యూఢిల్లీ,జూలై21(వార్త వేదిక సూర్య): ఇటీవల జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై నిష్పక్షపాతంగా దర్యాప్తు సాగుతోందని కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. విదేశీ మీడియా కావాలనే ప్రమాదంపై అనుచిత వార్తలు ప్రచారం చేస్తోందని అన్నారు. లోక్‌సభలో ప్రతి పక్షాలు ప్రశ్నించిన నేపథ్యంలో.. అందుకు సంబం ధించిన వివరాలను వెల్లడించారు. అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమానం ప్రమాదంపై దర్యాప్తు అంతర్జాతీయ ప్రోటోకాల్‌లకు అనుగుణంగా జరుగుతోందని ఆయన తెలిపారు. ఈ దర్యాప్తును ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బోర్డ్ నిర్వహిస్తోందన్నారు. ప్రమాదం ఎలా, ఎందుకు జరిగిందనే దానిపై సమగ్ర దర్యాప్తు కొనసాగుతోందని, తుది నివేదికలో పూర్తి వివరాలు వెల్లడవుతాయని మంత్రి

మిగతా 2లో..

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

## బెట్టింగ్ యాప్ కేసు దర్యాప్తు ముమ్మరం

(మొదటి పేజీ తరువాయి)

విచారణకి హాజరవ్వాలని నోటీసులో తెలిపారు. విదేశీ బెట్టింగ్ యాప్‌లను వీరు ప్రమోట్ చేసినట్లు ఈడీ అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో వీరిని మనీ లాండరింగ్ కోణంలో ఈడీ అధికారులు విచారణ చేయనున్నట్లు తెలుస్తోంది. బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసినందుకు ఆయా కంపెనీల నుంచి సినీ సెలబ్రెటీలకు నగదు ఎక్కడి నుంచి వచ్చిందనే విషయంపై విచారణ చేయనున్నారు. ఇప్పటికే హైదరాబాద్, సైబరాబాద్ పోలీసులు వీరిపై కేసులు నమోదు చేశారు. ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ అధికారులు కేసు నమోదు చేశారు. సినీ సెలబ్రెటీలు బెట్టింగ్ యాప్‌లని ప్రమోట్ చేయడంతోనే పలువురు ఆకర్షితులు అయ్యారని ఈడీ అధికారులు, పోలీసులు చెబుతున్నారు. బెట్టింగ్ యాప్‌లలో పెట్టుబడి పెట్టి అమాయకులు మోసపోయినట్లు అధికారులకి ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలో ఈడీ అధికారులు, పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు జరుపుతున్నారు. ఎంతోమంది బెట్టింగ్ యాప్‌ల బారిన పడి ఆత్మహత్యలు చేసుకోవడంతో ఈడీ అధికారులు, పోలీసులు ఈ కేసుని సీరియస్‌గా తీసుకుని విచారణ జరుపుతున్నారు.

## కేరళ మాజీ సీఎం వీఎస్. అచ్యుతానందన్ కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

అచ్యుతానందన్.. లెనిన్, స్టాలిన్, మావోల జీవితాలతో పాటు.. ప్రపంచ కమ్యూనిస్టు చరిత్రలో అనేక కీలకఘట్టాలను చూసిన అత్యంత అరుదైన నేత. బాల్యంలో పేదరికం కారణంగా ప్రాథమిక స్థాయిలోనే చదువు ఆపేసి... దర్జీ దుకాణంలో, కొబ్బరి పీచు ఫ్యాక్టరీల్లో పనిచేస్తూ.. జీవనం సాగించిన అచ్యుతానందన్ కార్మిక ఉద్యమంలో అడుగుపెట్టారు. 1940లో కమ్యూనిస్టు పార్టీ సభ్యుడయ్యారు. స్వాతంత్ర్యానికి ముందున్న ట్రావెన్‌కోర్ సంస్థానంలో భూస్వాములపై పోరాటంలో భాగంగా జైలుకెళ్లటంతో ఆరంభమైన ఆయన రాజకీయ ప్రస్థానం అంచెలంచెలుగా ప్రజా నేతగా ముఖ్యమంత్రి స్థాయికి చేరింది. 1964లో సీపీఐ జాతీయ కౌన్సిల్‌ను వదిలేసి.. సీపీఎం ఏర్పాటులో కీలకపాత్ర పోషించారు. 1967 నుంచి 2016 దాకా కేరళ అసెంబ్లీకి ఎన్నికైన ఆయన ఒకసారి (20062011) ముఖ్యమంత్రిగా, మూడుసార్లు విపక్షనేతగా వ్యవహరించారు. అవినీతికి వ్యతిరేకంగా పోరాటంలో ఎన్నడూ వెనకంజ వేయని అచ్యుతానందన్... రాష్ట్రంలో భూ ఆక్రమణదారులపైనా ముఖ్యమంత్రిగా ఉక్కుపాదం మోపారు. ఈ చర్యలతో అనేకమంది వ్యతిరేకమైనా ఆయన వెరవలేదు. ప్రజలు.. పార్టీ మధ్య అంతరం వచ్చినప్పుడు మార్క్సిస్టు పార్టీ క్రమశిక్షణనూ పక్కనబెట్టి ప్రజల పక్షాన నిలబడటానికే పెద్దపీట వేశారు. ఈ క్రమంలో అవమానాలు ఎదురైనా తన నిజాయితీబాటను, నిరాడంబరతను ఏనాడూ వీడలేదు. పుట్టింది 1923లో అయినా... ఆధునిక అవసరాలను కూడా అర్థం చేసుకున్న నిత్య అధ్యయనశీలి. పాతతరంలో భూమి కొంతమంది చేతుల్లో కేంద్రీకృతమైనట్లుగా... సాంకేతిక ప్రపంచంలో సాఫ్ట్‌వేర్‌ల రూపంలో కొన్ని కంపెనీల గుత్తాధిపత్యం సాగుతోందని గుర్తించిన ఆయన... అందరికీ అందుబాటులో ఉండే ఓపెన్ సోర్స్ సాఫ్ట్‌వేర్ కోసం ఉద్యమించారు. 2016లో తన 93వ ఏట కూడా కమ్యూనిస్టులకు వీఎస్ విజయవీచిక అయ్యారు.

## చీదరించుకునేలా రాజకీయ నేతల భాష

(మొదటి పేజీ తరువాయి)

దేశ ఆర్థిక వ్యవస్థ నలిగిపోతుంది. అధికారుల అవినీతి పెరిగిపోయింది. ముఖ్యంగా ఇరిగేషన్ శాఖలో పెరిగిన అవినీతిని నియంత్రించాలని గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. దేశవ్యాప్తంగా అవినీతి రోజురోజుకు పెరిగిపోతోంది. ఎన్నికల ఖర్చుల నియంత్రణ లేకపోవడమే ఈ అవినీతి పెరుగుదలకు ప్రధాన కారణం. ఈ విషయంలో సుప్రీంకోర్టు, ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకోవాలి. బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణ రాష్ట్రానికి నష్టం జరుగుతుంది. ఈ విషయంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. నేతల మధ్య పరస్పర దాడులు సరికాదు. సభ బయట సభ్యుల మధ్య జరిగే దాడులపై చట్టం తన పని తాను చేసుకుపోతుంది. సాగర్ ఎడమ కాలువ ద్వారా తాగు నీటిని ముందుగానే విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నానని గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు.

## స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతాం..

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. ఈ సమావేశంలో హరీష్‌రావు పాల్గొని బీఆర్ఎస్ శ్రేణులకి దిశానిర్దేశర చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మీడియాతో మాట్లాడారు. అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ గజ్వేల్ అని ఉద్ఘాటించారు. రేవంత్ ప్రభుత్వం అన్నదాతలని ఇబ్బందులకు గురిచేస్తోందని మాజీమంత్రి హరీష్‌రావు విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో రైతులు ఎరువులకు లైన్‌లో నిలబడ్డ దాఖలాలు లేవని.. రేవంత్ ప్రభుత్వంలో ఇప్పుడు ఎకరానికి ఒకటే బ్యాగ్ అంటున్నారని... మళ్లీ లైన్లలో నిలబడే పరిస్థితి తీసుకువచ్చారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందరూ రైతులకు రైతుబంధు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. మల్లన్నసాగర్‌లోకి కాళేశ్వరం నీళ్లు ఎందుకు విడుదల చేయడం లేదని నిలదీశారు. కేసీఆర్ హయాంలో మోటార్లు కాలకపోయేవని.. ఇప్పుడు మోటార్ వెండింగ్ దుకాణాలకు గిరాకీ పెరిగిందని విమర్శించారు. ఆనాడు తెలంగాణలో ఒక ఎకరం అమ్మితే ఆంధ్రాలో పది ఎకరాలు భూమి కొనవచ్చని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారని గుర్తుచేశారు. ఇప్పుడు రేవంత్ పాలనలో తెలంగాణలో రెండు ఎకరాలు అమ్మితే ఆంధ్రాలో ఒక ఎకరం కొనే పరిస్థితి వచ్చిందని మాజీమంత్రి హరీష్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. తమ పాలనకు, కాంగ్రెస్ పాలనకు ప్రజలు బేరీజు వేసుకుంటున్నారని, స్థానిక ఎన్నికల్లో గట్టి బుద్ధి చెప్పబోతున్నారని అన్నారు. ప్రజలు బిఆర్ఎస్ పట్ల పూర్తి విశ్వాసంతో ఉన్నారని అన్నారు.

## ఆపరేషన్ సిందూర్‌పై చర్చించాలి

(మొదటి పేజీ తరువాయి)

భారత్–పాకిస్తాన్ సంఘర్షణ సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన శాంతి ఒప్పందం వాదనలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఏప్రిల్ 22న జరిగిన పెహల్గామ్ దాడి గురించి మాట్లాడుతూ, ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దాడి జరిగి నెలలు గడిచినా, ఆ ఉగ్రవాదులను ఇప్పటి వరకు పట్టుకోలేదు, వారి గురించి సమాచారం కూడా లేదన్నారు. మా పార్టీ మాత్రమే కాదు, అన్ని పార్టీలు దేశాన్ని బలోపేతం చేయడానికి, సైన్యానికి ధైర్యం నింపడానికి మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. కానీ, ఇప్పుడు అసలు పెహల్గామ్ దాడి జరిగిన దాని గురించి స్పష్టమైన సమాచారం కావాలని ఖర్గే డిమాండ్ చేశారు. ఇంటెలిజెన్స్ విషయంలో లోపం జరిగిందని లెఫ్టినెంట్ గవర్నర్ చెప్పారు. ఆ క్రమంలో ఆపరేషన్ సిందూర్ గురించి ప్రభుత్వం ప్రపంచానికి, భారత ప్రజలకు చెప్పింది. కానీ, ఆ తర్వాత ఏమైంది, ఏం జరిగిందో సమాచారం ఇవ్వాలని ఖర్గే కోరారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, భారత్‌పాకిస్తాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరిందని 24 సార్లు పేర్కొన్నారని ఖర్గే గుర్తు చేశారు. ట్రంప్ ఈ విషయాన్ని ఎందుకు చెబుతున్నారు? శాంతి ఒప్పందం జరిగిందా? ఒకవేళ జరిగితే, దాని వివరాలు ఏంటి? ప్రభుత్వం ఈ విషయంలో స్పష్టత ఇవ్వాలన్నారు. దేశ ప్రజలకు, పార్లమెంటుకు సమాచారం అందించడం ప్రభుత్వం బాధ్యత అని ఈ సందర్భంగా ఖర్గే గుర్తు చేశారు. ఈ దాడి వెనుక ఉన్న ఉగ్రవాదులను పట్టుకోవడంలో జాప్యం జరగడం, ఇంటెలిజెన్స్ వైఫల్యం గురించి ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. మన సైన్యం ధైర్యంగా పోరాడుతోంది. కానీ, ఇటువంటి సంఘటనలు మన భద్రతా వ్యవస్థలోని లోపాలను బయటపెడుతున్నాయి. ప్రభుత్వం ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. విపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే చేసిన వ్యాఖ్యలకు ప్రతిస్పందనగా ప్రభుత్వం మాట్లాడేందుకు సిద్ధంగా ఉందని, అన్ని వివరాలనూ దేశ ప్రజలకు తెలియజేస్తామని బీజేపీ నేత, రాజ్యసభలో లీడర్ ఆఫ్ ది హౌస్ జేపీ నడ్డా స్పష్టం చేశారు. అయితే ప్రభుత్వం ఈ ప్రశ్నలకు ఎలా సమాధానం ఇస్తుంది, ఏంటనేది ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

## పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

అయితే ప్రశ్నోత్తరాలు కొనసాగుతున్నాయి, మీరు చర్చక్రమంలో వస్తే సమాధానం ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పీకర్ ప్రకటించారు. పోడియంలోకి రావడం, నిలబడి నినాదాలు చేయడం తగదని అన్నారు. వారి నినాదాల నడుమ స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాలను చేపట్టారు. ప్రతిపక్ష ఎంపీలు నిరసన విరమించాలని సభాపతి పలుమార్లు విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ వారు వినిపించుకోకపోవడంతో సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత పార్లమెంటు సమావేశాలు జరగడం ఇదే తొలిసారి.

# భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండండి

(మొదటి పేజీ తరువాయి)

వర్షాలు కురుస్తున్నాయని.. అన్ని విభాగాలను అప్రమత్తం చేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో ఇప్పటికే 150 బృందాలను ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. వాతావరణ సూచనలకు అనుగుణంగా కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి సమన్వయం చేసుకుని ముందుగానే బృందాలను పంపిస్తున్నామని చెప్పారు. పోలీస్ కమిషనరేట్లల్లోని ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో ఉండాలని ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పని చేయాలని సూచించారు. జిల్లాల్లో పిడుగుపాటు కారణంగా జరిగే నష్టాల వివరాలు నమోదు చేయాలని వారికి వివరించారు. గిరిజనులు అంటువ్యాధుల బారిన పడకుండా ఐటీడీఏ ప్రాంతాల అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు ఎల్లవేళలా ప్రజలకు అందుబాటు లో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పశువులకు సంబంధించి వెటర్నరీ విభాగం సైతం అప్రమత్తంగా ఉండాలని హుకుం జారీ చేశారు. ఆ క్రమంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్లను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. అజాగ్రత్తగా ఉంటే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. ప్రతీరోజు జిల్లా కలెక్టర్ల కార్యాచరణకు సంబంధించి ప్రభుత్వానికి పూర్తి నివేదికను అందించాలని సీఎస్ రామకృష్ణారావును ఈ సందర్భంగా సీఎం ఆదేశించారు. భారీ వర్షాలను దృష్టిలో పెట్టుకుని.. సాగునీటికి సంబంధించి వాటర్ మేనేజ్‌మెంట్ ఉండాలని సీఎం రేవంత్ రెడ్డిగ అభిప్రాయపడ్డారు. 2 కోట్ల 85 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి చేయడం ద్వారా దేశంలోనే తెలంగాణ నెంబర్ వన్ స్థానంలో నిలిచిందని ఆయన గుర్తు చేశారు. యూరియా స్టాక్‌కు సంబంధించి ప్రతీ ఎరువుల దుకాణం వద్ద స్టాక్ వివరాలను బోర్డుపై ప్రదర్శించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. స్టాక్ డిటైల్స్ ఆన్‌లైన్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎరువుల కొరత ఉన్నట్లు కొందరు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్రంలో కావాల్సినంత యూరియా స్టాక్ ఉందని ఆయన స్పష్టం చేశారు. ఇతర వ్యాపార అవసరాలకు యూరియా ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకోండంటూ ఆధికారులను ఆదేశించారు. రైతుల కంటే ఏదీ ముఖ్యం కాదని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎరువులకు సంబంధించి ఫిర్యాదులకు ప్రత్యేక డెస్క్ ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులను ఈ సందర్భంగా సీఎం రేవత్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 96 లక్షల 95 వేల 299 రేషన్ కార్డులు ఉన్నాయన్నారు. గతంలో రేషన్ షాపులపై ఆసక్తి ఉండేది కాదని.. సన్న బియ్యంతో రేషన్ కార్డులకు డిమాండ్ పెరిగిందన్నారు. అంతేకాదు రేషన్ కార్డు విలువ, రేషన్ షాపు విలువ పెరిగిందన్నారు. జులై 25 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు అన్ని మండల కేంద్రాల్లో అధికారికంగా రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం జరపాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఇన్‌చార్జి మంత్రులు రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమాలను జిల్లా కలెక్టర్లు కోఆర్డినేట్ చేసుకోవాలని.. అలాగే ప్రతీ మండలంలో జిల్లా కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లు పాల్గొనాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. జిల్లాల పరిధిలోని ఐఏఎస్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, రోజూ కలెక్టర్లు ఏ పనిచేశారో తనకు తెలియజేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. వారి కార్యాచరణ రిపోర్టు రోజూ తనకు పంపించాలన్నారు. వర్షాలు, వానాకాలం పంటసాగు, సీజనల్ వ్యాధులు, రేషన్‌కార్డుల పంపిణీ తదితర అంశాలపై చర్చించారు. రాయితీ ఎరువులను ఇతర అవసరాలకు వాడితే కఠిన చర్యలు తీసుకోవాలి. కలెక్టర్లు వాటర్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి పెట్టాలి. అత్యవసర పరిస్థితుల్లో కలెక్టర్లు ఖర్చు చేసేందుకు ఒక్కొక్కరికి రూ.కోటి కేటాయించాలి. రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ.. ఆందోళన అవసరం లేదని సీఎం అన్నారు. ఈ సమీక్షా సమావేశంలో వివిధ శాఖల మంత్రులు, ఉన్నతాధికారులు, కలెక్టర్లు పాల్గొన్నారు.

# 42శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ మోసం

(మొదటి పేజీ తరువాయి)

ఊరుకోం. మీకు న్యాయ సలహాదారులు లేరా?ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్ తీసివేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి. ముస్లింలకు ఇచ్చినవి రాజకీయ రిజర్వేషన్లు.. అందుకే వ్యతిరేకిస్తున్నాం. 42 శాతం బీసీ రిజర్వేషన్లను తొమ్మిదో షెడ్యూల్‌లోకి తీసుకురాలేం. దానికి సుప్రీంకోర్టు అనుమతించదు. తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని అసెంబ్లీలో ఎందుకు చెప్పలేదని రామచంద్ర రావు ప్రశ్నించారు. పార్టీని ఎలా నడిపించాలనే విషయంపై పెద్దల మార్గదర్శనం తీసుకునేందుకు ఢిల్లీకి వచ్చానని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. 46 సార్లు ఢిల్లీకి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ దక్కలేదన్నారు. కానీ ప్రధానమంత్రి సహా కేంద్ర మంత్రులందరూ ఎప్పుడు అడిగితే అప్పుడు రేవంత్ రెడ్డికి సమయం ఇచ్చారని, మీ పార్టీ ముఖ్యమంత్రికి మీరే ఎందుకు సమయం ఇవ్వడం లేదు చెప్పాలన్నారు రామచందర్ రావు. మతపరమైన రిజర్వేషన్లను మేము వ్యతిరేకిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. తొమ్మిదో షెడ్యూల్లో పెట్టడం కేంద్రం బాధ్యత అని అని అంటున్నారని, లీగల్ ఒపీనియన్ లేకుండా ఆర్డినెన్స్ తీసుకువచ్చారన్నారు. తొమ్మిదో షెడ్యూల్లో పెట్టే అంశాలు కూడా న్యాయ సమీక్షకు లోబడి ఉంటాయని కేశవనంద భారతి కేసులో సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని, 2006లో అయ్యర్ కోహ్లీ కేసులో .. సుప్రీంకోర్టు మరోసారి కేశవనంద భారతి కేసు తీర్పు ను దగ్గర మరోసారి పునరుద్ఘాటించిం దన్నారు. తెలంగాణ బీసీలను తప్పుదోవ పట్టించేందుకు ముఖ్యమంత్రి ఆర్డినెన్స్ తెచ్చారని, న్యాయపర మైన చిక్కులు తెలిసి ...బీసీలను మోసం చేస్తున్నందుకు ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలన్నారు. బీసీ బిల్లుకు, ఆర్డినెన్స్ కు మద్దతు ఇచ్చాం.. వాటిని అమలు చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీదేనని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాకుండా.. ఎన్నికలు జరగకుండా ఉండేందుకు జరిగే ఎత్తుగడే ఈ మోసమని ఆయన ఆరోపించారు. తమిళనాడు తీర్పు నేపథ్యంలో ...తొమ్మిదో షెడ్యూల్ లో పెట్టే పరిస్థితి లేదని, పార్టీ క్రమశిక్షణ దాటితే ఊరుకునే ప్రసక్తి లేదన్నారు రామచందర్‌రావు. నాయకులందరూ పార్టీ విధానాలకు లోబడే పని చేయాలని, ఈ అంశాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లామన్నారు. కాంగ్రెస్‌లో రేవంత్ రాజగోపాల్ రెడ్డి మధ్య సమస్యలు.. బీఆర్ఎస్‌లో కవితకు పార్టీకి మధ్య గొడవలు ఉన్నాయన్నారు. ప్రతి పార్టీలోనూ గొడవలు ఉన్నాయి వాటిని అంతర్గతంగా పరిష్కరించుకుంటామన్నారు.

# విదేశీ మీడియా తప్పుడు ప్రచారాలు నమ్మవద్దు

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. మొదటి దశ దర్యాప్తు ఇప్పటికే పూర్తయింది. ఈ దశలో ప్రాథమిక నివేదికను విడుదల చేసింది. విమానంలోని బ్లాక్ బాక్స్‌కు కొంత నష్టం జరిగినట్లు తెలిసింది.

సాధారణంగా, బ్లాక్ బాక్స్‌కు నష్టం జరిగినప్పుడు దానిని విశ్లేషణ కోసం తయారీదారుకు పంపడం ఆనవాయితీ. అయితే, ఈ సారి భారతదేశంలోనే మొదటిసారిగా బ్లాక్ బాక్స్ డీకోడింగ్ ప్రక్రియ విజయవంతంగా జరిగిందని మంత్రి రామ్ మోహన్ నాయుడు వెల్లడించారు. ఇది భారతదేశ పౌర విమానయాన రంగంలో ఒక ముఖ్యమైన విజయంగా ఆయన అభివర్ణించారు. దర్యాప్తు ప్రక్రియలో నిష్పాక్షికతను మంత్రి సమర్థించారు. కొన్ని విదేశీ మీడియా సంస్థలు ఈ ప్రమాదంపై తమ సొంత కథనాలను రూపొందించి తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు.

అలాంటి కథనాలను తాను గమనించానని, వాటిని నమ్మొద్దన్నారు. ఈ సందర్భంగా, ఎయిర్ ఇండియా లేదా బోయింగ్ వంటి సంస్థలకు మద్దతు ఇవ్వడం కాదని, తమ లక్ష్యం కేవలం సత్యాన్ని వెలికితీసేందుకేనని రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. దర్యాప్తు ప్రక్రియను అందరూ గౌరవించాలని, నిజమైన సమాచారం తుది నివేదిక ద్వారా బయటకు వస్తుందని ఆయన వెల్లడించారు. ఇలాంటి విమాన ప్రమాద దర్యాప్తులు అంతర్జాతీయంగా ఒక నిర్దిష్ట ప్రక్రియను అనుసరిస్తాయని మంత్రి వివరించారు. భారతదేశం కూడా ఈ అంతర్జాతీయ ప్రమాణాలకు కట్టుబడి ఉందని, ఈ దర్యాప్తు ఆ దిశగా సాగుతోందని ఆయన పేర్కొన్నారు. ప్రమాద కారణాలను గుర్తించేందుకు సమగ్ర విశ్లేషణ జరుగుతోందని, తుది నివేదికలో అన్ని వివరాలు స్పష్టమవుతాయని ఆయన హామీ ఇచ్చారు. ఈ విషయంపై లోక్‌సభలో జరిగిన చర్చల సందర్భంగా, కార్యకలాపాలు మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడ్డాయి.

# లిక్కర్ మాఫియా గుప్పిట్లో ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

కమిషన్లకు కక్కుర్తిపడి, లిక్కర్ మాఫియాకు తలొగ్గి కల్లు కాంపౌండ్ బంద్ చేయాలని చూస్తున్నారని మండిపడ్డరు. కల్లులో మీరే ఏదో కలిపి కుట్ర చేస్తూ ఓఆర్ఆర్ లోపల కల్లుపై నిషేధం విధించాలని చూస్తున్నారు. కుల వృత్తిని అవమానించే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయిని నిషేధించడంలో ప్రభుత్వం ఎందుకు విఫలం అవుతుంది. కల్తీ పాలు అరిటకట్టడంపై ప్రభుత్వం ఎందుకు దృష్టి పెట్టడం లేదు. రాష్ట్రంలో విచ్చలవిడిగా ఫార్మా కంపెనీలకు పర్మిషన్లు ఇస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో నిషేధించిన బీర్లను తెలంగాణలో అమ్ముతున్నారని అన్నారు. నియోజకవర్గంలో ఒక్కో ఎమ్మెల్యేకు 10 నుంచి 15 లక్షలు ఇస్తున్నారు. దాదాపు 35 మంది ఎమ్మెల్యేలు నెలవారీ డబ్బులు తీసుకుంటున్నారు. కల్తీ కల్లును ప్రోత్సహిస్తున్నది ఎవరనేది ప్రభుత్వం తేల్చాలి. గీత సంఘాల నుంచి ఎమ్మెల్యేలు డబ్బులు తీసుకుంటూ కల్తీ కల్లును ప్రోత్సహిస్తున్నారా? బిఆర్ఎస్ హయాంలో జిల్లాకో నీరా కేంద్రం పెట్టాలని భావించాం. హైదరాబాద్ నగర నడిబొడ్డున నీరా కేఫ్ పెట్టి కులవృత్తిని కాపాడాం. కల్లు కంపౌండ్ దమ్ముంటే బంద్ చేసి చూడండి. కల్లు కంపౌండ్ బంద్ చేస్తే ప్రభుత్వాన్ని నడవనీయం. మళ్లీ కేసీఆర్ సీఎం కాగానే కల్లు దుకాణాలను తెరిపిస్తాం. వైన్ షాపులు కల్లుగీత కార్మికుల కుటుంబాలకు ఇస్తాం అని ప్రకటించారు. నిజామాబాద్ జిల్లాలో గౌడ కులస్తులపై నిషేధం విధించారు. 60 మంది గౌడ కుల స్త్రీలు గుడికి వెళ్తే గుళ్లోకి రావద్దని వెనక్కి పంపారు. లక్షలు, లక్షలు మామూళ్లు తీసుకుని కల్లు దుకాణాలు బంద్ చేస్తామంటే చూస్తూ ఊరుకోం. కల్లు దుకాణాలు బంద్ పెడితే బల్కంపేట ఎల్లమ్మ తల్లి ఆలయం వద్ద మామూళ్లు తీసుకుంటున్న ఎమ్మెల్యేల పేర్లు బయటపెడతాం. హైదరాబాద్ నగర శివారు ప్రాంతంలో గీత చెట్లు ఉన్నాయి. కల్లు కంపౌండ్ పేదోళ్లకు రిక్రియేషన్ సెంటర్ లాగా ఉంటుంది. తాము అధికారంలోకి వచ్చాక లిక్కర్ మాఫియా నుంచి, కల్లు కంపౌండ్ నుంచి డబ్బులు వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. అలాగే తాటి చెట్లు నరికిన వారిపై కేసులు పెట్టాల్సిందిగా ఆయన డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్ మాట్లాడుతూ.. దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేస్తోందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి బీసీల పట్ల వివక్ష చూపుతున్నారన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ కాంగ్రెస్ పార్టీకి గుర్తుకు రాలేదా అని ఆయన ప్రశ్నించారు. 34 శాతం రిజర్వేషన్లపై 2013లో కాంగ్రెస్ పార్టీ కోర్టుకు అఫిడవిట్ ఇచ్చి, ఈసారికి మాత్రమే బీసీ రిజర్వేషన్లు అని చెప్పిందన్నారు. కాంగ్రెస్ పార్టీ మూలంగానే ఏపీ, తెలంగాణలో బీసీలకు 23 శాతం రిజర్వేషన్లు అమలు అవుతున్నట్లు తెలిపారు. బీసీలకు రేవంత్ రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీల పట్ల రేవంత్ రెడ్డి. ఎప్పుడూ సానుకూలంగా లేరన్నారు. 2018లో మహారాష్ట్రలో ఆర్డినెన్స్ ఇచ్చి ఎన్నికలకు వెళ్తే నామినేషన్ల తర్వాత కోర్టు తీర్పు ద్వారా ఎన్నికలు ఆగిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ కోర్టుకు వెళ్లడంతోనే బీసీలకు గతంలో రిజర్వేషన్లు రాలేదన్నారు. బీసీ రిజర్వేషన్లపై రాహుల్ గాంధీ వద్దకు తీసుకువెళ్లి కేంద్రంపై పోరాటం చేస్తామని రేవంత్ రెడ్డి అబద్ధాలు చెప్తున్నారన్నారు. బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చి ఎన్నికలు నిర్వహించాలని భిక్షమయ్య గౌడ్ చెప్పారు. తుంగతుర్తి నియోజకవర్గం పర్యటన సందర్భంగా గౌడన్నలకు ఇస్తామన్న హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేసిన శ్రీకాంత్ అనే యువకుడిని కొట్టించారన్నారు. జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న జిల్లాగా నామకరణం చేస్తామని చెప్పి రేవంత్ రెడ్డి మాట తప్పారన్నారు. శ్రీకాంత్‌పై జరిగిన దాడికి సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని పేర్కొన్నారు. కల్లు అనేది ప్రకృతి పానీయమని, అలాంటి కల్లుని నిషేధించాలని ప్రభుత్వం చూస్తోందని కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్ అన్నారు. కల్తీ కల్లును కచ్చితంగా అరికట్టాలి. కానీ ఆ పేరుతో కల్లును నిషేదిస్తే ఖబడ్దార్ రేవంత్ రెడ్డి అని ఆయన హెచ్చరిం చారు. కల్లు మండువాలు, కల్లు గీత కార్మికుల జోలికి వస్తే రాజకీయంగా సంగతి తెలుస్తా మన్నారు. కల్లుగీత కార్మికులకు 25 శాతం వైన్ షాపులు కేటాయిస్తామని హామీ ఇచ్చి మాట తప్పారని దుయ్యబట్టారు. కల్లుగీత కార్మికులను దొంగల్లా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని, గీత కార్మికుల ఉసురు ప్రభుత్వానికి కచ్చితంగా తగులుతుందన్నారు. నీరా కేఫ్‌ను హైదరాబాద్ నగరంలో పెడితే కాంగ్రెస్ వచ్చాక ఆగం చేసిందన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నేతలు గట్టు రాంచందర్ రావు, నాగేందర్ గౌడ్ పాల్గొన్నారు.

# మేడిన్ ఇండియా ఆయుధాల వైపు ప్రపంచం చూపు..

(మొదటి పేజీ తరువాయి)

ఒకే సమయంలో ఈ విజయాన్ని కొనియాడాయని మోదీ అన్నారు. ఈ విజయాలు భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలకు ప్రేరణగా నిలుస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. దేశంలో వాతావరణం చాలా బాగా అభివృద్ధి చెందుతోందన్నారు. వ్యవసాయ రంగంలో అభివృద్ధిని కూడా ప్రస్తావించారు. ఈ ఏడాది వర్షాకాలం వ్యవసాయానికి అనుకూలంగా ఉందని, నీటి నిల్వలు గత దశాబ్దంతో పోలిస్తే దాదాపు మూడు రెట్లు పెరిగాయని తెలిపారు. ఇది రైతుల ఆర్థిక వ్యవస్థ, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ఆయన చెప్పారు. ఈ అభివృద్ధి దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ వర్షాకాల సమావేశాన్ని ప్రధాని మోదీ జాతీయ గర్వంతో నిండిన విజయోత్సవ సమావేశంగా అభివర్ణించారు.

ఈ వర్షాకాల సమావేశాలు ఫలప్రదం కావాలని ఆకాక్షించారు. ఈ సందర్భంగా భారత వ్యోమగామి శుభాంశు శుక్లా రోదసి యాత్ర, 'ఆపరేషన్ సిందూర్ ' గురించి ప్రధాని ప్రస్తావించారు. ఆపరేషన్ సిందూర్‌లో మన దేశ సైనికుల సత్తా చూశాం. అందులో వందశాతం లక్ష్యాలను సాధించాం. కచ్చితమైన లక్ష్యంతో కేవలం 22 నిమిషాల్లోనే ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేశాం. ఈ ఆపరేషన్‌తో మేడిన్ ఇండియా సైనిక సామర్థ్యం, గొప్పతనం ఏంటో ప్రపంచం చూసింది. ఈ మధ్య కాలంలో నేను ఎవరిని కలిసినా మేడిన్ ఇండియా ఆయుధాల గురించే మాట్లాడుతున్నారు. మన ఆయుధాలపై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి పెరుగుతోంది దేశ ప్రగతి కోసం అందరూ కలిసి నడవాల్సిన సమయమిది. ఉగ్రవాదం, నక్సలిజాన్ని తుదముట్టించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మావోయిస్టు ప్రభావిత జిల్లాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మోదీ వెల్లడించారు. ఆపరేషన్ సిందూర్‌పై మన ఎంపీలు ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో పర్యటించి వివరించారని ప్రధాని గుర్తు చేశారు. పాక్ దుష్ట చర్యలను అంతర్జాతీయ సమాజం ముందు ఎండగట్టారని అన్నారు. తుపాకులు, బాంబుల ముందు మన రాజ్యాంగం బలంగా నిలబడిందని తెలిపారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లో ఆపరేషన్ సిందూర్ విజయాన్ని వేడుక చేసుకోవాలన్నారు. దేశ ప్రయోజనాలకు సంబంధించిన విషయాల్లో ఐక్యత చాలా అవసరమని.. ఎంపీలు, రాజకీయ పార్టీలకు పిలుపునిచ్చారు. ఈ పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు దేశానికి చాలా గర్వకారణంగా నిలవబోతున్నాయి. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో మన మువ్వన్నెల జెండా ఎగరడం దేశ ప్రజలందరికీ గర్వకారణం. అంతరిక్ష యాత్రలో ఇదో ప్రేరణ. ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తుందని మోదీ ప్రశంసించారు. దేశవ్యాప్తంగా వర్షాలు బాగా కురుస్తున్నాయని, ఇది రైతులకు లాభదాయకమని ప్రధాని ఆనందం వ్యక్తం చేశారు. రైతుల జీవితాలు, ఆర్థిక వ్యవస్థ వర్షాలపై ఆధార పడ్డాయని తెలిపారు. ఈసారి పడిన వర్షాలు వ్యవసాయానికి ఊతమిస్తాయి. రైతుల జీవితాలు, ఆర్థిక వ్యవస్థ వర్షాలపై ఆధారపడి ఉన్నాయి. ఈ వర్షాకాల సమావేశాలు ఫలప్రదం కావాలని కోరుకుంటున్నానని అన్నారు. అంతరిక్షంలో కొత్త చరిత్ర సృష్టించామని.. ఐఎస్ఎస్ లో మువ్వన్నెల జెండా ఎగరడం దేశ ప్రజలకు గర్వకారణం అని అన్నారు. భారత సైనిక పాటవాలను ప్రపంచ దేశాలు ప్రత్యక్షంగా చూసాయి.

పహల్గాం ఊచకోతను చూసి ప్రపంచ దేశాలు నివ్వెరపోయాయని, పాక్ నిజస్వరూపాన్ని ఎంపీల బృందం ప్రపంచ దేశాలకు వివరించిందన్నారు. పార్టీలకు అతీతంగా పలు పార్టీలు, పలు రాష్ట్రాల ప్రతినిధులు దేశహితం కోసం పని చేశారు.. వివిధ దేశాల్లో పర్యటించి పాక్ ఉగ్రవాదంపై ఎంపీలు ప్రచారం చేసారని, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ ది మూడో స్థానమని అన్నారు. 25 కోట్ల మందిని దారిద్య రేఖ నుంచి బయటకు తీసుకొచ్చామని మోదీ వ్యాఖ్యానించారు.

### లోక్‌సభలో గొంతు నొక్కారు

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర రక్షణ మంత్రి, ప్రభుత్వంలోని ఇతర మంత్రులకు మాట్లాడడానికి అవకాశం ఇచ్చి.. తనకు మాత్రం అభిప్రాయాలను తెలియజేసే అవకాశం ఇవ్వడం లేదని మండిపడ్డారు. ప్రతిపక్ష నేతగా లోక్‌సభలో మాట్లాడే హక్కు తనకు ఉన్నప్పటికీ..వారు ఈ విధంగా చేయడం ప్రతిపక్షాల హక్కులను కాలరాయడమే అవుతుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. లోక్‌సభలో చర్చలు మొదలవగానే ప్రధాని మోదీ అక్కడినుంచి వెళ్లిపోయారన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అన్ని విషయాల్లో తమకు అనుకూలంగా ఉండే కొత్త విధానాలను సృష్టించుకుంటోందని దుయ్యబట్టారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. లోక్‌సభ, రాజ్యసభ సమావేశమయిన అనంతరం ఆపరేషన్ సిందూర్'తో పాటు పలు అంశాలపై చర్చకు పట్టుబడుతూ లోక్‌సభ లో విపక్షాలు ఆందోళన చేపట్టాయి. ప్రతిపక్ష ఎంపీలు నిరసనను విరమించాలని సభాపతి పలుమార్లు విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ వారు వినిపించుకోకపోవడంతో సభను కొంతసేపు వాయిదా వేశారు. రాజ్యసభలో చర్చలు కొనసాగాయి. ఈ సందర్భంగా లోక్ సభలో తీవ్ర గందరగోళం కొనసాగింది. పహల్గాం దాడి, ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు కాంగ్రెస్ పార్టీ ఎంపీలు డిమాండ్ చేశారు. అలాగే, వాయిదా తీర్మానాలపై చర్చించాలని కోరారు.

# ప్రజా పోరాటాలతో సమస్యల పరిష్కారానికి దారి



### సిపిఎం మునుగోడు నియోజకవర్గస్థాయి శిక్షణ తరగతులు: నాంపల్లి చద్రమౌళి

**నాంపల్లి, జూలై 20(వార్త వేదిక సూర్య):** నల్లగొండ జిల్లా నాంపల్లి మండలం రాజకీయ చైతన్యం తోటే ప్రజా సమస్యల పరిష్కారానికి అవకాశం ఉంటుందని సిపిఎ మండల కార్యదర్శి నాంపల్లి చద్రమౌళి పేర్కొన్నారు. మునుగోడు నియోజకవర్గస్థాయి రాజకీయ శిక్షణ తరగతులను జూలై 25న మర్రిగూడ మండల కేంద్రంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఈ తరగతుల్లో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి తీగల సాగర్, సోషల్ మీడియా రాష్ట్ర ఇన్‌చార్జి పిట్టల రవి బోధన చేస్తారని తెలిపారు. ఈరోజు విలేకరుల సమావేశంలో ఈ విషయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాంపల్లి చంద్రమౌళి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలలో ఒక్కటీ నేటి వరకూ అమలుకావడం లేదని తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడం వల్లే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు

ధరణి బదులు తీసుకువచ్చిన భూభారతి వ్యవస్థ ద్వారా రైతుల భూముల సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పినా, వాస్తవానికి ఎక్కడా పరిష్కారం కాలేదన్నారు. దరఖాస్తులు చేసినా ప్రభుత్వానికి జవాబుదారిత్వం లేదని, సమస్యల పరిష్కారంపై నమ్మకం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

కిష్టరాంపల్లి ప్రాజెక్టులకు సంబంధించిన నిర్వాసితులకు ఇప్పటికీ ఆర్ & ఆర్ పథకం పూర్తిగా అమలుకాలేదని, భూములు కోల్పోయిన రైతులకు ప్యాకేజీలు ఇవ్వక పోవడం ప్రభుత్వ ఉద్దేశ్యాన్ని ప్రశ్నించేదిగా ఉందన్నారు అలాగే, అర్హులైన పేదలకు పెన్షన్లు ఇవ్వకుండా నాలుగు సంవత్స రాలుగా కొత్త పెన్షన్‌లు మంజూరుకాకపోవడం ఆందోళనకరమన్నారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలు ఇప్పుడు కబ్జాకు గురవు తున్నాయని, నూతనంగా ప్రభుత్వం సేకరించిన భూమిలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం మండల తదితరులు పాల్గొన్నారు.

# సంస్థాన్ కోట మీద కాషాయ జెండా ఎగురవేస్తాం

### -దోనూరు వీరారెడ్డి



**సంస్థాన్ నారాయణపురం, జూలై 20(వార్త వేదిక సూర్య):** స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడుతున్న నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మండల శాఖ అధ్యక్షులు సుర్వి రాజుగౌడ్. ఆధ్వర్యంలో గుజ్జ మరియు వావిల్లపల్లి ఎంపీటీసీ పరిధిలో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశాలు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనూరు వీరారెడ్డి గారు పాల్గొని మాట్లాడుతూ మండలంలోని జడ్పిటిసి,ఎంపీపి గెలవడం కోసం మెజారిటీ స్థానాలను కైవసం చేసుకోవాలని అన్ని గ్రామాల కార్యకర్తలు సన్నద్ధం కావాలని దానికోసం నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలియజేస్తూ,రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు గుర్తు చేస్తూ స్థానిక సంస్థల ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ అభ్యర్థులను గెలిపించి సంస్థాన్ నారాయణపురం కోట మీద కాషాయ జెండా ఎగురవేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జక్కలి రాజు యాదవ్, తంగెళ్ళ సత్తయ్య జక్కర్తి బిక్షపతి ఆత్మూరి రాములు ఎలిజాల శీను కుకుడాల మహేందర్ రెడ్డి జక్కర్తి నరసింహ చాపల రాములు చెన్నకేశవులు నరసింహారెడ్డి సత్యనారాయణరెడ్డి గోపాల్ మరియు భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేతన్న భరోసా పథకాన్ని ఏలాంటి షరతులు లేకుండా అమలు చెయ్యాలి

### చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు వెంకటనర్సు



**ఆత్మకూరు (ఎం), జూలై 21 (వార్త వేదిక సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం ప్రభుత్వం ప్రకటించిన నేతన్న భరోసా మగ్గంనేస్తూ జియోట్యాగ్ కలిగిన ప్రతి చేనేత కార్మికునికి ఏలాంటి షరతులు లేకుండా అర్హత కలిగిన ప్రతి చేనేత కార్మికునికి అందించాలని, చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు వెంకటనర్సు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో నిర్వహించిన చేనేత కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. దేశంలో వ్యవసాయం తరువాత అత్యంత ప్రాదాన్యత కలిగిన చేనేత పరిశ్రమ, పాలకుల నిర్లక్ష్యం కారణంగా నిర్వీర్యం అవుతుందని విమర్శించారు. చేనేత కార్మికులు నేసిన బట్టల నైపుణ్యాన్ని, ప్రతిభను దేశ, విదేశీయులు కొనియాడుతున్నా, వారి జీవన స్థితిగతులను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎన్నికల ముందు కాంగ్రెస్ చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేసి, కార్మికులు ఎదు ర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.

చేనేత పరిశ్రమ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి కార్మికులకు పని కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, ప్రభుత్వం ప్రకటిం చిన నేతన్న భరోసా, చేనేత రుణమాఫీ, ఏలాంటి షరతులు లేకుండా వెంటనే అమలు చేసి, జియోట్యాగ్ కలిగిన ప్రతి చేనేత కార్మికునికి అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రచ్చ గోవర్ధన్, వంగరి బుచ్చిరాములు, రచ్చ రమేష్, గుర్రం నర్సింహా, ఎలగందుల శ్రీనివాస్, నల్ల నర్సయ్య, దయానందం తదితరులు పాల్గొన్నారు.

# మాదిగ ఉద్యమంలో అమరులైన కుటుంబాలను ఆదుకోవాలి

### - చిలకమర్రి గణేష్ మాదిగ



**సంస్థాన్ నారాయణపురం, జూలై 20(వార్త వేదిక సూర్య):** 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటంలో తమ హక్కుల కోసం ఏబిసిడి వర్గీకరణ న్యాయ బద్ధంగా జరగాలని పోరాడి తన ప్రాణాలను సైతం దారపోసినా మాదిగ అమరవీరులనుఆంధ్ర ప్రదేశ్ తెలంగాణ ప్రభుత్వాలు వారి కుటుంబాలను ఆదుకోవాలని ఎమ్మార్పీఎస్ ఉద్యమకారుల ఫోరం సభ్యులు చిలకమర్రి గణేష్ మాదిగ ఆవేదన వ్యక్తం చేశారు నాటినుండి నేటి వరకు అంటరానివాలుగా వెలివేసి దళిత బిడ్డలను కేవలం రాజకీయ నాయకులు కర్రే వేపాకుల వాడుకుంటున్నారు నాటి శ్రమ ఫలితమే నేటీ ఎమ్మార్పీఎస్ రిజర్వేషన్లు ఫలాలు దక్కాయని అన్నారు.

ఎమ్మార్పీఎస్ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో అమరులైన కుటుంబాలను పరామర్శించి మండల కేంద్రంలో మాట్లాడుతూ 75 శాతం ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ప్రజలకు రిజర్వేషన్ దక్కాలని డిమాండ్ చేశారు అనంతరం వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి రెండు నిమిషాలు మౌనం పాటించి వారికి వారి ఆత్మకు శాంతి కలగాలని అందుకు రాష్ట్ర ప్రభుత్వం .ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు సుప్రీంకోర్టు ఇచ్చినటువంటి ఎస్సీ వర్గీకరణ తీర్పును అనుసరించి దేశంలోనే మొట్ట మొదటిసారిగా ఏ బి సి మూడు గ్రూపులుగా ఏర్పాటు చేసి మాదిగలకు 9.75 శాతాన్ని కేటాయించినందుకు కృతజ్ఞత తెలియజేసుకుంటూ వారు చేసిన త్యాగం గొప్పతనము అందుకు ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో అమరులైన కుటుంబాలను మరియు ఉద్యమకారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం సభ్యులు చిలకమర్రి గణేష్ మాదిగ సూర్పంగా సుగుణ మాదిగ,సుక్క సుదర్శన్ మాదిగ,బొడ్డు నరసింగరావు మాదిగ,చింతల శంకర్ మాదిగ,ఏర్పుల జంగయ్య మాదిగ,రాము మాదిగ,ఎడ్ల ఈశ్వరమ్మ మాదిగ,తదితరులు పాల్గొన్నారు. నివాళులర్పించిన అమరవీరుల కుటుంబాలు యాఖరి యాదగిరి,ఎడ్ల రామకృష్ణ,ఎర్రవెల్లి నరసింగరావు వారికి నివాళులు అర్పించారు.

సామాజిక ఉద్యమ నమస్కారాలతో ఎమ్మార్పీఎస్ ఉద్యమకారుల ఫోరం తెలంగాణ.



# కొండగడప విద్యార్థికి ప్రముఖుల ప్రశంసలు

**మోత్కూరు, జూలై 20(వార్త వేదిక సూర్య):** మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని కొండగడప గ్రామానికి చెందిన దొండ స్వాతి ఢిల్లీ సెంట్రల్ యూనివర్సిటీ లో చదువుతున్నారు. ఆ యూనివర్సిటీ లో పరిశోధక విద్యార్థిని చదువుతున్న స్వాతి అక్షరాకాశం పుస్తకాన్ని ఇటీవల రూపొందించింది. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో ఆచార్య సాగి కమలాకర్ శర్మ సంపాదకత్వంలో ఆచార్య కసిరెడ్డి వెంకట్ రెడ్డి అశీతి ఉత్సవం సందర్భంగా వెలువడిన ఆచార్య కసిరెడ్డి వెంకట్ రెడ్డి సాహిత్య సమాలోచనం "అక్షరాకాశం "పుస్తకావిష్కరణ జరిగింది. అనంతరం మూసీ సాహిత్య ధార జాతీయ సాహిత్య పరిషత్ భాగ్యనగర్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని తెలుగు యూనివర్సిటీ పటేల్ ఆడిటోరియంలో జరిగిన ఆవిష్కరణ కార్యక్రమంలో ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి స్వాతిని శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు..స్వాతి ప్రముఖ సాహితీవేత్తల నుండి ప్రశంసలు అందుకుంది.

ఈ సందర్భంగా స్వాతి మాట్లాడుతూ చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ సూర్య ధనుంజయ్ ప్రసిద్ధ సాహితివేత్తలు ముదిగొండ శివప్రసాద్ నలిమిల భాస్కర్ ఆట్టం దత్తయ్య వంటి ప్రముఖుల వ్యాసాల సరసన తన వ్యాసం చోటు చేసుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ఈసందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు ఆకవరం వల్లభాయ్ వీరాచారి ,కృష్ణ ఉప్పలయ్య, కొండగడప గ్రామస్థులు లెంకల వేణు, కన్నెబోయిన లింగం ఎర్రబెల్లి యాదయ్య, , తొంట భాస్కర్ , నోముల రమేష్ నేతతో పాటు పలువురు అభినందించారు.






# ఘనంగా మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలు

**రామన్నపేట, జూలై 20(వార్త వేదిక సూర్య):** రామన్నపేట పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో అఖిలభారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. రామన్న పేట సుభాష్ సెంటర్‌లో కేకు కట్ చేసి కార్యకర్తలకు మిఠాయి పంపిణీ చేసినారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ ఖర్గే నాయకత్వం, రాహుల్ గాంధీ నాయకత్వం రేవంత్ రెడ్డి నాయకత్వం శాసనసభ్యులు వేముల వీరేశం నాయకత్వం వర్ధిల్లాలంటూ నినాదాల చేసినారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్ కాంగ్రెస్ నాయకులు మొహమ్మద్ నాసర్, వనం చంద్రశేఖర్, మీర్జా బషీర్ బేగ్, బొడ్డు సాలయ్య, కోట సుధాకర్, మొహమ్మద్ అక్రం, మోటో రమేష్ , బొడ్డు శంకరయ్య, కొమ్ము శేఖర్, ఆమోద లక్ష్మణ్, అనంత కుమార్, కేశవదాస్ వెంకటేశం, గురుకుశివ, మీర్జా ఖదీర్, మహమ్మద్ కరీం ,గొలుసుల ప్రసాద్ ,మోటే మహేష్, మొహమ్మద్ జానీ ,మొహమ్మద్, గాదే అంజి, రిజ్వాన్ ,కక్కిరేణి రవీందర్, కె సుదాస్ ఉదయ్, కొమ్ము వెంకటేష్, డేవిడ్, శేఖర్, రుద్రాల శంకరయ్య, మొహమ్మద్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

# మోటకొండూరు ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

### అధ్యక్షుడుగా చామల మహేందర్ రెడ్డి, ఉప అధ్యక్షుడుగా షేక్ ఉస్మాన్

### ప్రధాన కార్యదర్శిగా గుర్రాల నాగరాజు, జాయింట్ సెక్రటరీగా సూధగాని నవీన్ గౌడ్, కోశాధికారిగా కంది చంద్రకళ వెంకట్ రాంరెడ్డి

### సహాయ కార్యదర్శులుగా పుల్లె నరేష్ యాదవ్, కోలా పరుశురాములు గౌడ్

**మోటకొండూరు, జూలై20(వార్త వేదిక సూర్య):** మోటకొండూరు మండల కేంద్రంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో సోమవారం రోజున ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్షులుగా చామల మహేందర్ రెడ్డి (వార్త) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా షేక్ ఉస్మాన్(ప్రజా పక్షం) ,ప్రధాన



కార్యదర్శిగా గుర్రాల నాగరాజు (క్యూ న్యూస్, శనార్తి తెలంగాణ), కోశాధికారిగా కంది చంద్రకళ వెంకటరాం రెడ్డి (రాయల్ పోస్ట్), జాయింట్ సెక్రటరీ గా సూదగాని నవీన్ గౌడ్ (మన తెలంగాణ),సహయ కార్యదర్శులుగా ,కోల పరశురామ్ (మనం) ,పుల్లె నరేష్ (నవ తెలంగాణ), కమిటీ సభ్యులుగా గట్టికొప్పుల శ్రీనివాస్ (నిజం చేపుతాం)లు ఎన్నికయ్యారు. ఈ సంధర్భంగా అధ్యక్షుడు మహేందర్ రెడ్డి మాట్లాడుతూ తనను ప్రెస్ క్లబ్ అధ్యక్షుడుగా ఎన్నుకున్నందుకు జర్నలిస్టుల సమస్యలపై పోరాడతానని తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

# గీత కార్మిక సంఘం మండల కమిటీ ఎన్నిక

**గట్టుప్పల, జూలై 20(వార్త వేదిక సూర్య):** గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొండ వెంకన్న ఆధ్వర్యంలో గీత కార్మిక సంఘం గట్టుప్పల మండల అధ్యక్షునిగా పెదగాని నరసింహ మండల ప్రధాన కార్యదర్శిగా పర్సగని యాదగిరి ఎనిమిది




మందితో మండల కమిటీ ఎన్నుకోవడం జరిగింది. గీత కార్మికుల డిమాండ్స్ పెండింగ్‌లో ఉన్నగీత కార్మికుల ఎక్స్‌గ్రేషియ చెల్లించాలి మరియు మండల వ్యాప్తంగా అర్హత కలిగి ఉన్న కార్మికులకు సేఫ్టీ మొకులు మంజూరు చేయాలి. అర్హత కలిగిన గీత కార్మికులకు ఫించన్ ఇవ్వాలని వెంకన్న డిమాండ్ చేశారు ఈ. కార్యక్రమంలో గీత సంఘం నాయకులు చాపల మారయ్య, మాదగాని రామస్వామి, పర్సగోని రాములు, జనగాం భిక్షం ,లింగంపల్లి నరసింహ, యాదయ్య, పెట్టగల జంగయ్య, అంజయ్య, డొంకని లింగస్వామి, వనం కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి దేవస్థానం, యాదగిరిగుట్ట


**తేదీ : 21/07/2025, సోమవారం**

**శ్రీస్వామి వారి ఆదాయము రూ: 17,27,365/-**

**శ్రీ స్వామి వారికి 700 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు**

| | | |
|---|---|---|
| కళ్యాణ కట్ట | - | 35,000/- |
| ప్రధాన బుకింగ్ | - | 1,16,100/- |
| కైంకర్యములు | - | 14,300/- |
| సుప్రభాతం | - | 13,200/- |
| బ్రేక్ దర్శనం | - | 1,57,200/- |
| వ్రతాలు | - | 30,400/- |
| వాహన పూజలు | - | 7,100/- |
| VIP దర్శనం | - | 2,10,000/- |
| ప్రచారశాఖ | - | 11,100/- |
| పాతగుట్ట | - | 10,700/- |
| కొండపైకి వాహన ప్రవేశం | - | 2,51,000/- |
| యాదఋషి నిలయం | - | 56,198/- |
| సువర్ణ పుష్పార్చన | - | 43,116/- |
| శివాలయం | - | 12,000/- |
| శాశ్వత పూజలు | - | 25,000/- |
| పుష్కరణి | - | 350/- |
| ప్రసాదవిక్రయం | - | 7,00,030/- |
| లాకర్స్ | - | 300/- |
| అన్నదానం | - | 20,291/- |
| ప్రసాద వితరణ | - | 1,000/- |
| లీజస్ | - | --- |
| ఇతరములు | - | 12,980/- |








## బ్రాహ్మణ ఆర్థిక సంఘ ఆధ్వర్యంలో వన భోజనాలు

**కోరుట్ల, జూలై 20(వార్త వేదిక సూర్య):** కోరుట్ల బ్రాహ్మణ ఆర్థిక సంఘ ఆధ్వర్యంలో సమీపంలో గుమ్లాపూర్ వెంకటేశ్వర స్వామి దేవాలయ ఆవరణలో ఆశాఢమాస సందర్భంగా సోమవారం రోజున వనభోజనాలు ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం నిర్వహించే ప్రతిభాపురస్కారాలలో భాగంగా పదవ, ఇంటర్ మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన పాలెపు కార్తికేయ, సహస్ర, సలక్షణ, సౌఖ్య, సుశాంత్, శ్రీవర్షిణి, శ్రీనిధి, హాసిని, శ్రీనుత లకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. అదేవిదంగా ఇటీవల ఉపాధ్యాయునిగా పదవీ విరమణ చేసిన చిలుక మర్రి శ్రీనివాస్ ఆచార్యుల ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్థిక సంఘ అధ్యక్షులు పాలెపు రామకృష్ణ శర్మ మాట్లాడుతూ సంఘ ఆధ్వర్యంలో గత మూడు సంవత్సరాలనుండి అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని ఇక ముందు కూడా విద్యార్థుల ప్రతిభను చాటే కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమం లో సంఘ చైర్మన్ బ్రహ్మన్న శంకర్ శర్మ, గౌరవ అధ్యక్షులు సేనాపతి ప్రవీణ్ ఆచార్య, ప్రధాన కార్యదర్శి నితిన్ కుమార్, కోశధికారి స్వరాజ్ కిషన్ శర్మ, రమేష్ శర్మ, అరుణ్ శర్మ, ఫణింద్ర శర్మ మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## చెన్నూరులో లయన్స్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

**చెన్నూర్, జూలై 21. (వార్త వేదిక సూర్య):**

చెన్నూరులో లయన్స్ క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం శ్రీ విశ్వకర్మ భవన్ లో చేసారు. చెన్నూరు లయన్స్ క్లబ్ రెండవ సంవత్సరం ప్రతిష్టపన కార్యక్రమము జరిగింది. ఈ కార్యక్రమములో ముఖ్య అధితిగా 320 జిల్లా రెండవ ఉప గవర్నర్ లయన్ మోర బద్రేశం, పాల్గొని ఈ సందర్భంగా, వారు మాట్లాడుతూ.. చెన్నూరు పట్టణ గొప్పదనాన్ని కొనియాడుతూ, చెన్నూరు లయన్ క్లబ్ చేసిన సేవల వల్ల ఎంతో మందికి, కంటి చూపు వచ్చిందన్నారు. రక్త దాన శిబిరంతో చాలా మందికి




ప్రాణము పోసారు, అగ్ని ప్రమాదములో సర్వస్వము కోల్పోయిన కుటుంబ సభ్యులకు, బరోసా కల్పిస్తూ సహాయం అందచేశారు. లయన్స్ క్లబ్ నినాదం మానవ సేవే మాధవ సేవ అని తెలియజేస్తూ ఈ క్రింది క్లబ్ కమిటీ ని ప్రతిష్టాపన చేసి ప్రమాణస్వీకారము చేయించారు.లయనిస్టిక్ ఇయర్ 2025-26 గాను చెన్నూరు లయన్స్ క్లబ్ అధ్యక్షులుగా లయన్ జాడి తిరుపతి, కార్యదర్శిగా లయన్ సౌడం శ్రీనివాస్, కోశాధికారిగా లయన్ నిమ్మల సాగర్, మొదటి ఉపాధ్యక్షులుగా లయన్ బెల్లంపల్లి నాగరాజ గౌడ్, రెండవ ఉపాధ్యక్షులుగా లయన్ కట్ట సదానందం, జాయింట్ సెక్రటరీ లయన్ మాదాసు కిష్టయ్య, అడ్మినిస్ట్రేటర్ లయన్ కుంభం మల్లి కార్జున్ రెడ్డి, మెంబర్షిప్ చైర్మన్ లయన్ ఉప్పుల సతీష్, ఎల్సిఐఎఫ్ కోఆర్డినేటర్ లయన్ జాడి శేఖర్, సర్వీస్ చైర్పర్సన్ లయన్ బుద్దారపు ప్రకాష్ బాబు, మార్కెటింగ్ చైర్పర్సన్ లయన్ జక్కుల సత్యనారాయణ, ఫ్యామిలీ & విమెన్ మెంబర్షిప్ కోఆర్డినేటర్ లయన్ బండారి లక్ష్మణ్, క్లబ్ డైరెక్టర్లుగా లయన్ మద్ది కార్తీక్, లయన్ కప్ప ప్రతాప్ సింగ్, శ్రీరాంబట్ల వెంకట నాగరఘు, లయన్ బల్ల పోచన్న, రీజియన్ చైర్పర్సన్ %ఙ% ఇన్స్టలేషన్ ఆఫీసర్ లయన్ ఉస్మామల్ల రాజేంద్ర ప్రసాద్, జోన్ చైర్పర్సన్ %ఙ% క్లబ్ ఎక్సటెన్షన్ చైర్పర్సన్ లయన్ మోదుంపురం వెంకటేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక సేవా కార్యకర్త బలగం నిఖిల్ జన్మదిన వేడుకలు

**కోరుట్ల జులై 21 (వార్తా వేదిక సూర్య):**

కథలాపూర్ మండల కేంద్రంలో సోమవారం రోజున మండల సామాజిక సేవా కార్యకర్త బలగం నిఖిల్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువజన సంఘాల ఆధ్వర్యంలో కేకు, మిఠాయిలు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. నిఖిల్ ఆయురారోగ్యాలతో క్షేమంగా ఉండాలని,



భవిష్యత్తులో మరిన్ని సేవాకార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నారాయణ రెడ్డి, నాగేశ్వరరావు,శంకర్, అశోక్, శ్రీనివాస్, జీవన్ రెడ్డి, తిరుపతి, శశిధర్ యువజన సంఘాలనాయకులు పాల్గొన్నారు.

# గడి గురుజు ప్రాంతంలో నిర్మాణాలకు అనుమతులు...

### అనుమతులు నిర్మాణం కోసం కృషి చేసిన జువ్వాడి నర్సింగరావు

**కోరుట్ల, జూలై 20(వార్త వేదిక సూర్య):**

కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు కృషి వల్లనే కోరుట్ల పట్టణంలోని గడి గురుజు ప్రాంతంలో నూతన కట్టడాలకు అనుమతులు మంజూరు చేస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి కోరుట్ల మున్సిపల్ కార్యాలయాలకు రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేయడం జరిగిందని పలువురు కాంగ్రెస్ నేతలు తెలిపారు ఇందులో భాగంగా సోమవారం కోరుట్ల పట్టణ గడి గురించి ప్రాంతంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు ఈసందర్భంగా జిల్లా మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు వసీం సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కయ్యుమ్ జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలు సోగ్రాబి పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ఏఆర్ అక్బర్ లు మాట్లాడుతూ కోరుట్ల గడి గురుజు ప్రాంతంలో 300 ఫిట్ల లోపు నూతన కట్టడాలకు ప్రభుత్వ అనుమతి ఇవ్వకపోవడంతో కోరుట్ల గడ్డి గురుజు ప్రజలు కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన జువ్వాడి నర్సింగరావు గడి గురుజు ప్రాంత ప్రజల కోరిక మేరకు ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆర్కిటెక్చర్ విభాగం అధికారులను కలిసి ఇట్టి విషయం వివరించారు సానుకూలంగా స్పందించిన మంత్రి ఆర్కిటెక్చర్ విభాగం అధికారులు పూర్తి స్థాయి విచారణ చేపట్టి ఆ ప్రాంతంలో మెమో 8/2153/2013 ప్రకారం




గడి గురుజు ప్రాంతంలో 15 ఫీట్ల పరిధిలో ఎలాంటి నిర్మాణాలు ఇతర కార్యకలాపాలు అనుమతులు జారీ చేయవద్దని మున్సిపల్ కమిషనర్ కి తెలియజేశారు మిగిలిన ప్రాంతాల్లో అనగా 15 ఫీట్ల పరిధి దాటి తరువాత ఇల్లు నిర్మించుకోవడానికి అనుమతులు జారీ చేయాలని వాటికి అవసరమైన చర్యలు తీసుకోవాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ లకు జయేశ్ రంజన్ ఆర్డినెన్స్ జారీ చేశారు ఇట్టి విషయమై కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ జువ్వాడి నర్సింగరావు కోరిక మేరకు 15 పిట్ల పరిధి దాటి ఇళ్ల నిర్మాణం చేసుకోవచ్చని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆర్కిటెక్చర్ విభాగం అధికారులు అనుమతులు జారీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు గత పది సంవత్సరాలు అధికారంలో ఉండి మీరు ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజల సౌకర్యార్థం కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు విషయాన్ని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆర్కిటెక్చర్ విభాగం అధికారులకు విన్నవించి ప్రజల సౌకర్యార్థం ఇంటి నిర్మాణాల కోసం జువ్వాడి నర్సింగరావు కృషి చేస్తే అది మేమే చేశామని స్థానిక ఎమ్మెల్యే బిఆర్ఎస్ నేతలు వాట్సాప్ గ్రూపులో ఫేస్బుక్లో ట్విట్టర్లలో పెట్టుకోవడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి తప్ప ప్రజా ప్రభుత్వంలో కాంగ్రెస్ పార్టీ నేతలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమాన్ని తానే చేశానని చెప్పుకోవడం చాలా విడ్డూరంగా ఉందన్నారు గత అసెంబ్లీ ఎన్నికల్లో జువ్వాడి నర్సింగరావు ఓడిపోయిన ప్రజాభివృద్ధి సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో గడి గురుజు ప్రాంతంలో ఇంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వలేదు కానీ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జువ్వాడి నర్సింగరావు కృషి వలన గడి గురుజు ప్రాంతంలో 15 ఫీట్లు దాటిన తర్వాత ఇంటి నిర్మాణాలకు ఉత్తర్వులు జారీ చేయడం అభినందనీయమని తెలిపారు ఈకార్యక్రమంలో కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ తో పాటు కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి


### టీ పెన్షనర్ల రాష్ట్ర కార్యదర్శి హరి ఆశోక్ కుమార్.

**కోరుట్ల, జూలై 20(వార్త వేదిక సూర్య):**

పెన్షనర్ల సమస్యలు సత్వరం పరిష్కరించాలని తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి ఆశోక్ కుమార్ ప్రభుత్వంను కోరారు.సోమవారం కోరుట్ల పట్టణంలో తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ కోరుట్ల డివిజన్ శాఖ కార్యాలయంలో ఆ సంఘం అధ్యక్షుడు పబ్బా శివానందం ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి పెన్షనర్స్ సమావేశం జరిగింది.ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి హరిఆశోక్ కుమార్ హాజరయ్యారు.ఈ సమావేశంలో డివిజన్‌లోని పలువురు పెన్షనర్లు తమ ఇబ్బందులను వినిపించారు .ఈ సందర్భంగా హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ రిటైర్మెంట్



పొంది పది మాసాలు దాటినా విరమణ ప్రయోజనాలు,వైద్య ఖర్చుల చెల్లింపులు అందకపోవడంతో ఆర్థికంగా పలు అవస్థలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.పిల్లల వివాహాలు,ఇంటి నిర్మాణం తదితర అవసరాల కోసం సతమతమవుతున్న పరిస్థితి ఉందన్నారు. పెండింగులో ఉన్న డి.ఏ.లతో పాటు పీఆర్సీ సత్వరం మంజూరు తదితర సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. ఈ సమావేశంలో కోరుట్ల డివిజన్ అధ్యక్షుడు పబ్బా శివానందం,కార్యదర్శి గంటేడి రాజ్ మోహన్, వర్కింగ్ ప్రెసిడెంట్ చిలుక గంగారాం,అసోసియేట్ అధ్యక్షుడు రాజేశ్వర్, కోశాధికారి ఎన్.లక్ష్మీ నారాయణ,ఉపాధ్యక్షుడు ఎం.డి .సైఫోద్దీన్,సంయుక్త కార్యదర్శి టి.రాజయ్య,కోరుట్ల,మేడి పల్లి,కథలాపూర్ మండలాల పెన్షనర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.







# మార్కండేయ నగర్‌లో వైభవంగా బోనాల సంబరాలు

- మన సంస్కృతిని, సంప్రదాయాలను ప్రతిబింబించే పండుగ
- సమూహ భక్తితో మన సంస్కృతిని భావితరాలకు అందించాలి

**మైలర్‌దేవ్‌పల్లి, జూలై 20(వార్త వేదిక సూర్య):** రాజేంద్రనగర్ సర్కిల్ మైలర్‌దేవ్‌పల్లి డివిజన్‌లో బోనాల ఉత్సవాలు ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శ్రీ పోచమ్మ తల్లి దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అత్యంత భక్తిశ్రద్ధలతో అలంకరించారు. తెల్లవారు జామున అమ్మవారికి అభిషేకం నిర్వహించి, పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం మహిళలు ఒడి బియ్యం, బోనం సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు. పోతారాజుల నృత్యాలతో ఊరేగింపు సందడి చేసి, భక్తి శ్రద్ధలతో అమ్మవారికి బోనం సమర్పించారు. శివశత్తులు జోష్యం చెప్పారు. ఈ వేడుకలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే తొలకంటి ప్రకాష్ గౌడ్, బీజేపీ నియోజకవర్గ ఇంచార్జ్, డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి భారతీయ రాష్ట్ర సమితి నియోజకవర్గం ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకుని, ఉత్సవాలను ప్రశంసించారు. వారు మాట్లాడుతూ, ఇది మన సంస్కృతిని, సంప్రదాయాలను ప్రతి బింబించే పండుగ. సమూహ భక్తితో మన సంస్కృతిని భావితరాలకు అందించాలి అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పగిడిమర్రి సూర్యనారాయణ, ఏర్వ సత్యనారాయణ, విడం రమేష్, శిరం దాస్ నరేందర్, వర్కల చందు, కోట శ్యామ్ కుమార్, కోట పవన్, మామిడి శెట్టి శ్రీనివాస్, బొనకుర్తి రాము, ఉడుత సురేష్, భాస్కర్, భానుచందర్, శశిరాజ్, తిరుర్ నగర్ గోపాల్, నాయకులు సాయి గౌడ్, సరికొండ వెంకటేష్, జీవన్ గౌడ్, అడికె అర్జున్, కళ్లెం లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరాగాంధీ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఎన్నికలు విజయవంతం

### కొత్త పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక

### నూతన అధ్యక్షులుగా సంకూరి జయప్రకాష్

**మైలర్‌దేవ్‌పల్లి, జూలై 20(వార్త వేదిక సూర్య):**

ఇందిరా గాంధీ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ పాలకవర్గ ఎన్నికలు 2025 జూలై 19న జరగగా, అన్ని పదవులకు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి, జిల్లా సహకారాధికారి కార్యాలయం, రంగారెడ్డి జిల్లాకు చెందిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి.నాగేశ్వరరావు ఎన్నికల ఫలితాలను అధికారికంగా ప్రకటించారు. అధ్యక్షుడు సంకూరి జయప్రకాష్, ఉపాధ్యక్షుడు కె. ఎల్లప్ప, కార్యదర్శి మల్లెల శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి బి. ఫణి కుమార్, పాలకవర్గ సభ్యులుగా వారు ఎన్నికయ్యారు వి.లలిత, జి. సురేఖ వి. రమేశ్, బి. శ్రీనివాస్ గౌడ్, ఎమ్. ప్రభాకర్ రెడ్డి పాలకవర్గానికి ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు సొసైటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. కొత్తగా ఎన్నికైన బృందం సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా అధ్యక్షులు సంకూరి జయప్రకాష్ మాట్లాడుతూ,





సొసైటీ సభ్యులంతా నాకు మరియు మా బృందానికి మళ్లీ నమ్మకం చూపించి ఏకగ్రీవంగా ఎన్నిక చేయడం పట్ల హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ఈ నమ్మకానికి తగిన విధంగా పని చేస్తాము. సభ్యుల అవసరాలు, సౌకర్యాల విషయంలో పారదర్శకంగా, సమర్థంగా పాలన అందిస్తాం. సొసైటీ అభివృద్ధే మా లక్ష్యం. అని తెలిపారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గ సభ్యులకు అభినందనలు వెల్లువెత్తాయి. సభ్యులు, నివాసితులు కొత్త బృందం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలపై ఆశాభావం వ్యక్తం చేశారు.

# బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకుంటాం

- గోదావరిలో తెలంగాణ వాటను వదులుకునే ప్రసక్తే లేదు
- బిఆర్ఎస్వి మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బడికల శ్రావణ్
- చంద్రబాబుతో చీకటి ఒప్పందం చేసుకున్నా రేవంత్ రెడ్డిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు
- చంద్రబాబు శిష్యుడు రేవంత్ రెడ్డి వల్ల తెలంగాణ రాష్ట్రానికి తీవ్రమైన అన్యాయం
- బనకచర్ల ద్రోహాన్ని బద్దలు కొట్టి ఆంధ్రప్రదేశ్ జలదోపిడిని అడ్డుకొని తీరుతాం

**చెన్నూర్, జూలై 21. (వార్త వేదిక సూర్య):**

సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమంగా నిర్మించనున్న, బనకచర్ల ప్రాజెక్ట్ వలన తెలంగాణకు జరిగే అన్యాయాన్ని విద్యార్థులకు అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా, చెన్నూరు నియోజకవర్గ కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే, కళాశాల హాస్టల్ లో బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో నిర్వహించిన, అవగాహన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన బిఆర్ఎస్వి మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బడికల శ్రావణ్ మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్టు నుంచి 200 టీఎంసీల గోదావరి జలాలను రాయలసీమకు తరలించడం కోసం ఏపీ నిర్మించ తలపెట్టిన అక్రమ ప్రాజెక్టే పోలవరం-బనకచర్ల లింకు ప్రాజెక్టు, అని పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అడుగులకు మడుగులు ఒత్తుత్తు, తెలంగాణ రాష్ట్రము యొక్క నీళ్లను ఆంధ్ర కు దోచిపెట్టడానికి సిద్ధంగా ఉన్న రేవంత్ రెడ్డి చీకటి ఒప్పందాలకు చరమగీతం పాడాలని అన్నారు. అదేవిధంగా విద్యార్థులకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేయడం దుర్మార్గం, ఇంత వరకు స్కాలర్షిప్లు ఇవ్వలేదు, విద్యార్థులకు ఇస్తామన్న ఐదు లక్షల విద్య భరోసా కార్డు, విద్యార్థినిలకు స్కూటీలు ఇవ్వలేదు. మరియు అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని, తీవ్రమైన మోసం చేసినటువంటి మోసకారి రేవంత్ రెడ్డి, అదేవిధంగా ఎస్సీ ఎస్టీ విద్యార్థులు పది పాస్ అయితే 10000, ఇంటర్మీడియట్ పాస్ అయితే 15000, డిగ్రీ పాస్ అయితే 25000, పీజీ




పాస్ అయితే 1 లక్ష, ఏంఫిల్, పిహెచ్డి పూర్తిచేస్తే 5 లక్షల రూపాయలు, ఇస్తామని ఘోరంగా మోసం చేసిన రేవంత్ రెడ్డి సర్కార్, 6 గారంటీలకు, 420 హామీలకు తూట్లు పొడిచి, రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు మరియు బిజెపి ప్రభుత్వంతో అంటగడుగుతూ, పదవిని కాపాడుకుంటున్నటువంటి మోసకారి ప్రభుత్వం, తక్షణమే గోదావరి బనకచర్ల లింకు ప్రాజెక్టును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, లేని పక్షంలో భవిష్యత్తులో బిఆర్ఎస్ పార్టీ లక్షల మంది విద్యార్థులతో కాంగ్రెస్ ప్రభుత్వంను ముట్టడిస్తాము, అని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వి చెన్నూరు పట్టణ అధ్యక్షులు ఎండీ నాయబ్, సీనియర్ బిర్ఎస్వి నాయకులు అసంపెల్లి సంపత్, ప్రశాంత్ రెడ్డి, నక్క తిరుపతి, కమటం మనోహర్, అజయ్, రాజు కుమార్, ఊరడి రాజ్ కుమార్ యాదవ్, బొబ్బిలి రాజేష్, కంటం మనోహర్, ప్రశాంత్ రెడ్డి, తిరుపతి సురేష్, చాకినారపు అజయ్, బన్నీ, రమేష్, తిరుపతి, క్రాంతి, బాబ్యా, ప్రవీణ్, బిఆర్ఎస్వి కార్యకర్తలు పాల్గొన్నారు.

# 101 యూత్ అధ్యక్షుడిగా చేరాల కిరణ్ కుమార్



భూదాన్ పోచంపల్లి,జూలై 20(వార్త వేదిక సూర్య): పట్టణ కేంద్రం లోని 101 యువజన సంఘం నూతన అధ్యక్షుడి గా చేరాల కిరణ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం పట్టణ కేంద్రంలో జరిగిన యువజన సంఘం సమావేశంలో గౌరవ అధ్యక్షుడు చేరాల సుధీర్ కుమార్,మాజీ అధ్యక్షులు వంగూరి బాలకృష్ణ, పుప్పాల రవి,వంగూరి క్రాంతికుమార్,చేరాల నవీన్, కట్కూరి లింగస్వామి ఆధ్వర్యంలో యువజన సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన గౌరవాధ్యక్షులుగా వంగూరి బాలకృష్ణ, ఉపాధ్యక్షులుగా వంగూరి రాము , ప్రధాన కార్యదర్శిగా చేరాల విక్రమ్ కుమార్, కోశాధికారిగా వంగూరి శివశంకర్, సహాయ కార్యదర్శిగా వంగూరి బాలరాజ్,క్రీడల కార్యదర్శిగా ధనముని శివ,సమాచార కార్యదర్శిగా బాలమైసి నవీన్,చేరాల మహేందర్, సాంస్కృతిక కార్యదర్శిగా వంగూరి అరుణ్ ఎన్నిక య్యారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం సభ్యులు దొడ్డమోని సురేష్,చెక్కశ్రీకాంత్,వంగూరి సతీష్,చేరాల లింగస్వామి,చేరాల నరేష్,వంగూరి రాజకుమార్, వంగూరి కుమార్ ధనమోనీ విజయ్,పుప్పాల శివ,గునిగంటి శేఖర్, గునిగంటి శంకర్,చేరాల శ్రీకాంత్,దొడ్డమోని ఉదయ్, చేరాల నిఖిల్,పుప్పాల సతీష్ పాల్గొన్నారు.

# బస్సులలో అనుమానాస్పద వ్యక్తులతో ప్రయాణికులు జాగ్రత్తగా ఉండాలి: సి.ఐ.వెంకటేశ్వర్లు



మోత్కూరు, జూలై 20(వార్త వేదిక సూర్య): ఆర్టీసీ బస్సులలో అనుమానస్పద వ్యక్తులతో తోటి ప్రయాణికులు జాగ్రత్తగా వ్యవహరించాలని మోత్కూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ సి. వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం నాడు మున్సిపల్ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా సీ.ఐ మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులలో దొంగతనాలు, మోసపూరిత చర్యలు, సైబర్ నేరాలపై ప్రయాణికులకు పరి సూచనలు చేశారు. ప్రయాణికులు అపరిచితు వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని, తమ బ్యాగులు, విలువైన వస్తువులు ఇతర వివరాలను అపరిచిత వ్యక్తులతో పంచుకోవద్దన్నారు. బస్సులలో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు.

అదేవిధంగా సైబర్ నేరాలపై జరుగుతున్న పరిస్థితిని ఉంచుకొని అనుమానాస్పద లింకులు క్లిక్ చేయకూడదని బ్యాంకు వివరాలు ఎవరికీ ఇవ్వకూడదని సి.ఐ వెంకటేశ్వర్లు కోరారు. ప్రయాణికుల భద్రతనే తమ ప్రధాన లక్షణమన్నారు. ప్రజల సహకారంతో నేరాలను తగ్గించుగలమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఐ. కొంపల్లి సతీష్ పోలీస్ సిబ్బంది , తదితరులు.పాల్గొన్నారు.

# కామ్రేడ్ వి.ఎస్. అచ్చితానందన్ పోరాటాలు చిరస్మరణీయం

## - దొడ్డి కొమురయ్య భవన్లో సంతాప సభ



నల్లగొండ, జూలై 21 (వార్తా వేదిక సూర్య) వి ఎస్ అచ్యుతానందన్ స్ఫూర్తి నేటి యువతరానికి మార్క్సిస్టు పార్టీకి శిరోధార్యం అని లిసిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. కేరళ మాజీ ముఖ్యమంత్రి సిపిఎం వ్యవస్థాపక సభ్యులు కామ్రేడ్ వి.ఎస్ అచ్యుతానందన్ కేరళ రాష్ట్రం తిరువనంతపురం సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు హాస్పిటల్ లో అనారోగ్యంతో మరణించినారు. వారి చిత్రపటానికి పట్టణంలోని దొడ్డి కొమురయ్య భవన్లో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి మరణం పట్ల రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా జరిగిన సంతాప సభలో వారు మాట్లాడుతూ 1964 లోసిపిఎం ఏర్పాటు చేసిన సభ్యుల లో వారు ఒకరిని అన్నారు. నాటినుండి తుది శ్వాస విడిచే వరకు నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పేద మధ్యతరగతి కార్మిక రైతు ఉద్యమాలలో పనిచేస్తూ సమసమాజ నిర్మాణ స్థాపన కోసం ఎంతగానో కృషి చేశారని కొనియాడారు 2006 నుండి 11 వరకు కేరళ ముఖ్యమంత్రిగా పనిచేసి వారి కాలంలో అనేక భూసంస్కరణలు తీసుకువచ్చి వేలాది ఎకరాల భూమి పంపిణీ చేయడం జరిగిందని ఉచిత విద్య వైద్యం అందరికీ అందే విధంగా ఎంతగానో కృషి చేశారని అన్నారు కేరళలో ప్రతిపక్ష నాయకుడిగా 15 సంవత్సరాలు పనిచేస్తూ అధికార ప్రభుత్వానికి ప్రజా సంక్షేమం కోసం అనేక సలహాలు సూచనలు చేశారని అన్నారు స్వాతంత్ర ఉద్యమ కాలంలో బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో జైల్లో నిర్బంధించిన మొక్కవోని దీక్షతో స్వాతంత్ర ఉద్యమం కోసం పనిచేశారని గుర్తు చేశారు 2007 ఉమ్మడి జిల్లా కోదాడలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ అడవి హక్కుల చట్టం సమాచార హక్కు చట్టం తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారని చెప్పారు ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా నిర్బంధాలు వచ్చిన తుది శ్వాస వరకు పేద ప్రజల పక్షాన పోరాడాలని కొనియాడారు ఆయన సేవలు చిరస్మరణీయమని అలాగే ఆయన ఆశయ సాధన కోసం యావత్ పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు ఆయన మరణానికి సిపిఐ ఎం నల్గొండ జిల్లా కమిటీ సంతాపం ఆ రాష్ట్ర కమిటీకి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించింది

ఈ సంతాప సభలో సిపిఎం నాయకులు నారీ ఐలయ్య, పాలడుగు నాగార్జున, బండా శ్రీశైలం, ప్రభావతి, సయ్యద్ హాశం, చినపాక లక్ష్మీనారాయణ, గంజి మురళీధర్, మహమ్మద్ సలీం, పీ నర్సిరెడ్డి, దండెంపల్లి సత్తయ్య, తుమ్మల పద్మ, నలపరాజు సైదులు, మన్నెం బిక్షం, ఆవుట రవీందర్, కొండ వెంకన్న, కుంభం కృష్ణారెడ్డి, కోట్ల అశోక్ రెడ్డి, అద్దంకి నరసింహ, కందుల అశోక్, గుండాల నరేష్, బొల్లు రవీందర్ సర్దార్ అలీ పాలాది కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.




# సుదీని రుక్కమ్మ మృతి బాధాకరం

## -బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్

దేవరకొండ జూలై 21(వార్త వేదిక సూర్య): డిండి మండల బిఆర్ఎస్ ఉపాధ్యక్షులు సుదీని కృష్ణా రెడ్డి తల్లీ సుదీని రుక్కమ్మ మృతి చాలా బాధాకరమని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. సోమవారం సుదీని రుక్కమ్మ దశదిన కర్మ కార్యక్రమంలో ఆయన పాల్గొని రుక్కమ్మ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన భగవంతుని ప్రార్థించారు. ఆమె మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట బిఆర్ఎస్ పార్టీ డిండి మండల అధ్యక్షుడు రాజినేని వెంకటేశ్వర రావు, పిఏసిఎస్ చైర్మన్ మాధవరం శ్రీనివాస్ రావు,మాల్ రెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి ,బోడ్డుపల్లి జయంత్,లోకసాని శ్రీనివాస్ రెడ్డి,దుబాయ్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పంట రుణాలను రైతులు చేసుకోవాలి

## పి ఏ.సి.ఎస్ ఛైర్మెన్ వెంకటేశ్వర్లు



మోత్కూరు, జూలై 20(వార్త వేదిక సూర్య): రైతు సేవా సహకార సంఘంలో ఖరీఫ్ పంట రుణాలకు ఎకరానికి 45000 రూపాయల నుండి.1.50 ( ఒక లక్షా యాభై వేల రూపాయాలు) తీసుకోవచ్చని పి.ఎ.సి.ఎస్. చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం నాడు ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖరీఫ్ పంట రుణాల కోసం ఇటీవల డి.సి.సి.బి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డిని బట్వాడ చేయుటకు తాను అడగగానే 60 ,00000లక్షల రూపాయలు (అరవై లక్షల రూపాయలు) మంజూరు చేశారని తెలిపారు. సాకార సంఘం పరిధిలోని ఉన్న రైతులు పంట రుణాల కోసం సింగిల్ విండో కార్యాలయంలో సంఘం కార్యదర్శిని సంప్రదించాలని కోరారు ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.







# రేషన్ కార్డుల జారీ నిరంతరం ప్రక్రియ

## -ఓబీసీ మండల అధ్యక్షులు బత్తిని ఉప్పలయ్య గౌడ్



ఆత్మకూరు (ఎం), జూలై 21 (వార్త వేదిక సూర్య): యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం రేషన్ కార్డుల జారీ నిరంతరం ప్రక్రియ అని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ మండల అధ్యక్షులు బత్తిని ఉప్పలయ్య గౌడ్ అన్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు వస్తాయి అని,పేదలకు ప్రభుత్వం రేషన్ షాప్‌లో సన్న బియ్యం అందిస్తుంది అని,ఆలేరు నియోజకవర్గంలో మొదట ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, తరువాత ఇందిరా మహిళశక్తి క్రింద మహిళకు వడ్డీ లేని రుణాలు,ఇప్పుడు రేషన్ కార్డులు జారీ అయ్యాయి.

ప్రతి ఒక్క పేద వ్యక్తి సన్న బియ్యంతో అన్నం తినాలనే ఉద్దేశ్యం తో ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తుంది. ప్రతీ ఒక్కరూ కొత్తగా పెళ్ళిళ్ళు అయిన వధువులు అమ్మగారు ఇంట్లో ఉన్న రేషన్ కార్డ్‌లో ఉన్న పేరు తొలగించుకొని నూతన వరుడు వధువు కొత్తగా రేషన్ కార్డ్‌కు మీ సేవలో దరఖాస్తు చేసుకుని మండల కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలి అని, అలాగే పిల్లల పేర్లు కూడా జత చెయ్యాని వాళ్ళు కూడా జత చేసుకోవాలని ఆయన అన్నారు.

# ఆరెగూడెంలో విద్యుత్ షాక్‌కు గురై ఎద్దు మృతి

మోత్కూరు, జూలై 21 (వార్త వేదిక సూర్య): మోత్కూరు మున్సిపల్ పరిధిలోని ఆరెగూడెం గ్రామంలో విద్యుత్ టాన్స్ ఫార్మర్ దగ్గర రైతు అంబటి వేణు కు చెందిన ఎద్దు కరెంట్ షాక్ కు గురై మృతి చెందింది. సోమవారం సాయంత్రం ఎద్దుకు మేతే వేసే క్రమంలో ట్రాన్స్ఫార్మర్ వద్దకు వెళ్లి విద్యుత్ వైర్లు తగిలి ప్రమాదవశాత్తు అక్కడికక్కడే ఎద్దు కుప్పకూలి మృతి చెందింది. ఎద్దు కోల్పోయిన రైతు అంబటి వేణు కుటుంబం త్రీవ ఆర్థిక ఇబ్బందులు ఉందని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో ట్రాన్స్



ఫార్మర్ వద్ద భద్రత ఏర్పాట్లు లేక ఎద్దు బర్రెలు కోల్పోతున్నాయి. విద్యుత్ అధికారులు తక్షణమే స్పందించి విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ వద్దా పహరి గోడ ఏర్పాటు చేయాలని రైతులు పేర్కొంటున్నారు.. ఎద్దు కోల్పోయిన రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి.సీ.ఐ


మోత్కూరు, జూలై 20(వార్త వేదిక సూర్య): జువెల్లరీ షాపు యజమానులు నేరగాళ్లు దొంగలించిన ఆభరణాలపై అప్రమత్తంగా ఉండాలని సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం నాడు స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఏర్పాటుచేసిన జ్యువెలరీ దుకాణాల యజమానులకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రతి జ్యూవెలరీ షాప్‌లలో సీ.సీ కెమెరాలు, డబుల్ లాక్ సిస్టం, అల్లారం పరికరాలు తప్పనిసరిగా అమర్చుకోవాలని



అన్నారు. రోజువారీ నగదు, బంగారం విలువైన వస్తువులు రవాణా సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జ్యువెలరీ షాపులలో పెట్టుకునే సిబ్బందిని వారి గత చరిత్ర సరిచూసుకోవాలని సూచించారు. రాత్రి వేళలో తమ షాపుల వద్ద భద్రత గార్డులను ఉంచుకోవాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు ఏ వరైనా కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు..

# మాజీ బిజెపి మండల అధ్యక్షుడు సందీప్‌ను పరామర్శించిన భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు

మోత్కూరు, జూలై 20(వార్త వేదిక సూర్య): భారతీయ జనతా పార్టీ మాజీ మండల అధ్యక్షుడు దీటి సందీప్ తండ్రి కృష్ణయ్య ఇటీవల వారి స్వగ్రామమైన పొడిచేడు గ్రామంలో ఇటీవల మరణించారు. ఆయన ఆకాల మృతి చెందడం పట్ల భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు , మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వరరావు సోమవారం నాడు సందీప్ కుటుంబాన్ని పరామర్శించారు



అనంతరం కృష్ణయ్య చిత్రపటానికి పూలమాలలవేసి నివాళులర్పించి, సందీప్ కు అధైర్యపడవద్దని మనో ధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో భా.జ.పా. సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెపాక సాయిబాబా, తుంగతుర్తి అసెంబ్లీ కో- కన్వీనర్ కూరాకుల వెంకటేశ్వర్లు, మోత్కూర్ పట్టణ మాజీ అధ్యక్షులు పోచం సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

# పాముకాటు గురైన మహిళ : ఆసుపత్రికి తరలింపు



మోత్కూరు, జూలై 20(వార్త వేదిక సూర్య): అడ్డగూడూరు మండలం జానకీపురం గ్రామంలో వ్యవసాయ పొలంలో పనులు చేస్తుండగా ఓ మహిళ పాముకాటుకు గురై ఘటన సోమవారం. చోటు చేసుకుంది. జానకిపురం గ్రామానికి చెందిన బోనాల ప్రమీల (52) అనే మహిళ. కూలి నాలు పనులు చేస్తూ జీవనోపాధి పొందుతుంది. ప్రతిరోజు మాదిరిగానే సోమవారం నాడు వ్యవసాయ పొలం పనులను చేస్తుండగా అకస్మికంగా పాము కాటుకు గురైంది. ప్రమీల పాము కాటు గురైన వెంటనే కుటుంబ సభ్యులు గమనించి ఓ ప్రైవేట్ వాహనంలో మోత్కూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.






## నూతన పట్టు వస్త్రాలంకరణ మహెూత్సవంలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించిన ఎర్ర కృష్ణ జాంభవ్

దేవరకొండ, జూలై 21(వార్త వేదిక సూర్య): చందంపేట మండల కేంద్రంలో సోమవారం నాడు కొండ్రపల్లి నాగేష్ – జ్యోతి కుమార్తెలు మరియు కుమారుడు చి రీతిచరణ్య,. ప్రీతిచరణ్య, రోషన్‌ల నూతన పట్టు వస్త్రాలంకరణ మహెూత్సవము కార్యక్రమంలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు, న్యాయవాది ఎర్ర కృష్ణ జాంభవ్. వారితోపాటు ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు సహాదేవ్, కిషన్, కటామోని సైదులు,నాగరాజు, తదితరులు పాల్గొన్నారు

## సతీష్‌కు 10,000/- రూపాయలను ఆర్థిక సహాయం అందజేసిన బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్

దేవరకొండ, జూలై 21(వార్త వేదిక సూర్య): దేవరకొండ మండలంలోని గన్యా నాయక్ తండా గ్రామం పాలత్య తండాకు చెందిన సతీష్ అనారోగ్యంతో



హైద్రబాద్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని సతీష్‌కు ఖర్చుల నిమిత్తం బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్ తాను అందుబాటులో లేకున్నా తన అనుచరుల ద్వారా 10,000 రూపాయలను అందజేశారు. సతీష్ కుటుంబానికి అండగా ఉంటానని అధైర్యపడవద్దని వారికి ధైర్యం చెప్పారు నేనావత్ లక్ష్మణ్ నాయక్, రామావత్ శ్రీను, నరేష్, నాగ తదితరులు ఉన్నారు.

## శ్రద్ధాంజలి



దేవరకొండ,జూలై 21(వార్త వేదిక సూర్య): సోమవారం ఉదయం కొండమల్లేపల్లికీ చెందిన శివకార్ బాబులల్ సతీమణి విజయబాయి అనారోగ్యంతొ మరణించినది విషయం తెలుసుకొని భౌతిక కాయానికి పూల మాల వేసి శ్రద్ధాంజలి తెలిపి కుటుంబ సభ్యులకు ఓదార్చిన టీపీసీసీ పార్లమెంట్ కోఆర్డినేటర్ యం. ఏ. సిరాజ్ ఖాన్ నాయిని మాధవరెడ్డి మార్కెట్ డైరెక్టర్ పెద్దిశెట్టి సుధాకర్ నాయిని ప్రభాకర్ రెడ్డి కోట్ల జగదీశ్ నజీర్ మౌలానా ఎండీ ఖాదర్ ఎం ఏ ఖైసర్ ఖాన్‌లు శ్రద్ధాంజలి ఘటించారు.

## వలిశెట్టి పద్మశ్రీ మృతి బాధాకరం

### -బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్

దేవరకొండ, జూలై 21(వార్త వేదిక సూర్య):
రంగారెడ్డి జిల్లా వైద్య శాఖలో పిహెచ్ ఎస్ గా పని చేస్తున్న వలిశెట్టి పద్మశ్రీ మృతి చాలా బాధాకరమని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. సోమవారం బడంగ్పేట్ లో



పద్మశ్రీ మృత దేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన భగవంతుని ప్రార్ధించారు. ఆమె మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

## శ్రీ శ్రీ శ్రీ పెద్దమ్మ దేవత ప్రతిష్ఠ మహెూత్సవ కార్యక్రమానికి బి.ఆర్.ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ నాయక్‌కి ఆహ్వాన పత్రిక అందించిన ఆలయ కమిటీ సభ్యులు

దేవరకొండ, జూలై 21(వార్త వేదిక సూర్య):
డిండి మండలం తిప్పలనేని గౌరారంలో జరిగే శ్రీ శ్రీ పెద్దమ్మ దేవత ప్రతిష్ట మహెూత్సవ కార్యక్రమానికి బిఆర్ఎస్ దేవరకొండ నియోజకవర్గం నాయకులు



వడ్త్య రమేష్ నాయక్‌కి ఆహ్వాన పత్రిక అందజేసి ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరిన ఆలయ కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పెరిగిన హమాలి రేట్లు

### - పల్లా దేవేందర్ రెడ్డి

దేవరకొండ, జూలై 21(వార్త వేదిక సూర్య):
ఏఐటీయూసీ ఆధ్వర్యంలో దేవరకొండలోని సిమెంటు దిగుమతి హమాలి రేట్లు పెంచుకోవడం జరిగిందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి ,జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి తెలిపారు.సోమవారం దేవరకొండ లోని ప్రజా భవన్ లో జరిగిన సిమెంట్ షాప్ ల యాజమాన్యం మరియు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగిన చర్చల్లో పరస్పర అంగీకారము మేరకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హమాలిరేట్లూ పెంచుకోవడం జరిగిందని దేవేందర్ రెడ్డి తెలిపారు. రెండు సంవత్సరాలకొకసారి జరిగే అగ్రిమెంట్లో గత లో ఉన్నటువంటి రేట్లపై 16% అధనంగా పెంచుకోవడం జరిగినది అన్నారు. ఎగుమతి దిగుమతి హమాలి రేట్ల తో పాటు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం, సంవత్సరానికి రెండు జతల బట్టలు ఇవ్వాలని తీర్మానించారు. కార్మిక హక్కుల కోసం ఏఐటియుసి అండగా నిలబడి నిరంతరము రాజీలేని సమరశీల పోరాటాలను నిర్వహిస్తుందని అన్నారు. హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం రూపొందించి బీమా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వానికి కోరారు. అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం లేకపోవడం వల్ల లక్షలాదీ మంది కార్మికులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం




చేస్తారు. సమస్యల పరిష్కారం కోసం కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ డివిజన్ అధ్యక్షులు నూనె వెంకటేశ్వర్లు, కోశాధికారి జే వెంకట్రాములు,మండల కార్యదర్శి ఏ మల్లయ్య, సిమెంట్ షాప్ యజమానులు మారుపాక సురేష్ గౌడ్, కుంచకూరి ఆనంద్, నీల బాలస్వామి, బూరుగు రవి కుమార్, హమాలి యూనియన్ అధ్యక్షులు నీల వెంకటయ్య, కార్యదర్శి గోదాసి కృష్ణయ్య, దోమల వెంకటయ్య, యాదయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లందులో బైబిల్స్‌తగులబెట్టిన 9 మంది దుండగులను అరెస్ట్ చేసిన తెలంగాణ ప్రభుత్వానికి, పోలీస్‌లకు కృతజ్ఞతలు

### ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినంగా చర్యలు చేపట్టాలి

### క్రైస్తవ రాష్ట్ర నాయకులు బిషప్ దుర్గం ప్రభాకర్

నల్లగొండ, జూలై 21 (వార్తా వేదిక సూర్య):
స్థానిక హుజూర్నగర్ టౌన్ హాల్ నందు హుజూర్నగర్ పాస్టర్స్ పెలోషిఫ్ అధ్యక్షులు రెవ. మేసా దేవసహాయం ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ నాయకులు బిషప్ దుర్గం ప్రభాకర్, సూర్యాపేట జిల్లా పాస్టర్స్ పెలోషిఫ్ అధ్యక్షులు రెవ. గడ్డం డేవిడ్ రాజు మాట్లాడుతూ ఇటీవల కాలంలో దుండగులు, మతోన్మాదులు ఇల్లందు లో బైబిల్స్ తగలబెట్టటం హెయమైన చర్య అనీ, మతస్వేచ్ఛ అన్నీ మతాలకు రాజ్యాంగం కల్పించిన హక్కు అనీ,పర మత సహనం కలిగి ప్రతి ఒక్కరూ ఉండాలని, ప్రభుత్వం వెంటనే స్పందించి దోషులను ఆరెస్ట్ చేయడం పట్ల హార్షం వ్యక్తం చేస్తూ, తెలంగాణ పోలీసులకు, ప్రభుత్వంనికి కృతజ్ఞతలు తెలిపారు. మరల ఇలాంటి సంఘటనలు పునరవృతం కాకుండా తెలంగాణ ప్రభుత్వం,పోలీస్ శాఖ, డీజీపీ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



ఈ కార్యక్రమంలో ఆంధ్ర తెలంగాణ రాష్ట్రల కో ఆర్డినేటర్ పాస్టర్ సి. హెచ్. శ్యామ్ ప్రసాద్,జిల్లా ఉపాధ్యక్షులు రెవ. అన్నేపాక రవికాంత్, బిషప్ ముల్లంగి జాకబ్ రాజు, సూర్యాపేట నియోజకవర్గ అధ్యక్షులు రెవ. జలగం జేమ్స్, హుజూర్నగర్ పాస్టర్స్ చైర్మన్ రెవ తలకప్పల సుధాకర్, హుజూర్నగర్ నియోజకవర్గ సెక్రటరీ రెవ. పాతకోటి దేవదానం,పాస్టర్ ఉటుకూరి రాజు, హుజూర్నగర్ మండల అధ్యక్షులు డికెన్ ఫాదర్ పి. ఆమోస్, రెవ. బొక్క ఏలీయా రాజు,రెవ. ఏర్పుల క్రిస్టోఫర్, కొండేటి లాజర్, రెవ సి. హెచ్. కిరణ్ కుమార్,రూబెన్, యల్క ప్రభాకర్, భాస్కర్, మార్క్ తదితరులు పాల్గొన్నారు.

# మార్గదర్శక శిక్షణతో ప్రజా సమస్యల పరిష్కారానికి దారి

### సిపిఎం మునుగోడు నియోజకవర్గస్థాయి శిక్షణ తరగతులు : పాలడుగు నాగార్జున


నల్లగొండ, జూలై 21 (వార్తా వేదిక సూర్య):
రాజకీయ చైతన్యం తోటే ప్రజా సమస్యల పరిష్కారానికి అవకాశం ఉంటుందని, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు నాగార్జున పేర్కొన్నారు. మునుగోడు నియోజకవర్గస్థాయి రాజకీయ శిక్షణ తరగతులను జూలై 25న మర్రిగూడ మండల కేంద్రంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ తరగతుల్లో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి తీగల సాగర్, సోషల్ మీడియా రాష్ట్ర ఇన్‌చార్జి పిట్టల రవి బోధన చేస్తారని తెలిపారు. ఈరోజు మర్రిగూడలో జరిగిన సిపిఎం మండల కమిటీ సమావేశంలో ఈ విషయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా పాలడుగు నాగార్జున మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలలో ఒక్కటీ నేటి వరకూ అమలుకావడం లేదని తీవ్రంగా విమర్శించారు.




ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడం వల్లే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.ధరణి బదులు తీసుకువచ్చిన భూభారతి వ్యవస్థ ద్వారా రైతుల భూముల సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పినా, వాస్తవానికి ఎక్కడా పరిష్కారం కాలేదన్నారు. దరఖాస్తులు చేసినా ప్రభుత్వానికి జవాబుదారిత్వం లేదని, సమస్యల పరిష్కారంపై నమ్మకం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మర్రిగూడ మండలంలోని శివన్నగూడెం, కిష్టరాంపల్లి ప్రాజెక్టులకు సంబంధించిన నిర్వాసితులకు ఇప్పటికీ ఆర్ & ఆర్ పథకం పూర్తిగా అమలుకాలేదని, భూములు కోల్పోయిన రైతులకు ప్యాకేజీలు ఇవ్వకపోవడం ప్రభుత్వ ఉద్దేశ్యాన్ని ప్రశ్నించేదిగా ఉందన్నారు.అలాగే, అర్హులైన పేదలకు పెన్షన్లు ఇవ్వకుండా నాలుగు సంవత్సరాలుగా కొత్త పెన్షన్‌లు మంజూరుకాకపోవడం ఆందోళనకరమన్నారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలు ఇప్పుడు కబ్జాకు గురవుతున్నాయని, నూతనంగా ప్రభుత్వం సేకరించిన భూమిలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి ఎర్పుల యాదయ్య, మండల కమిటీ సభ్యులు కొట్టం యాదయ్య, సలవోజు రామలింగాచారి, దామెర లక్ష్మి, ఎరుకొండ రాఘవేందర్, తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ గ్రీవెన్స్ డేలో పలు ఫిర్యాదులను పరిశీలించిన జిల్లా ఎస్పీ

నల్లగొండ, జూలై 21(వార్త వేదిక సూర్య):
ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే పోలీస్ గ్రీవెన్స్ డే లో బాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు 38 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి, తమ సమస్యలను తెలుసుకొని, సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా పనిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకొవాలని, పోలీస్ స్టేషన్‌కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి చట్టపరంగా బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని, ఫిర్యాదుదారునికి భరోసా,నమ్మకం కలిగించాలని అన్నారు. ఎవరైనా చట్టవ్యతిరకమైన చర్యలు చేస్తూ శాంతి భద్రతలకు భంగం కలిగించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని అన్నారు. బాధితుల యొక్క ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.



## రామావత్ హిమావంత్ నాయక్ ఆధ్వర్యంలో సందీప్ జన్మదిన వేడుకలు

దేవరకొండ, జూలై 21(వార్త వేదిక సూర్య): దేవరకొండ నియోజకవర్గం మాజి ఎమ్మెల్యే రామావత్ రవీంద్ర కుమార్ తనయుడు రామావత్ హిమావంత్ చేతుల మీదుగా రామా వత్ సందీప్ జన్మదిన సందర్భంగా పోలేపల్లి ఎక్స్ రోడ్లు వద్ద కేక్ కట్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ దేవరకొండ మార్కెట్ డైరెక్టర్ వర్త్య బాలు మల్లెపల్లి మండలం ఉప సర్పంచ్‌ల పొరం అధ్యక్షులు తులసి రామ్ నాయక్ చింతపల్లి మండలం యువ నాయకులు అంజి పీఏపల్లి మండలం యువ నాయకులు బాలాజీ నాయక్ అంగోతా జయేందర్ జయరాం రాజేందర్ మున్నా సుజిత్ కిషన్ సురేష్ రాజేష్ శశి కుమార్ మహేందర్ వెంకటేష్ అనిల్‌గిరి తదితరులు పాల్గొన్నారు.



# రాజకీయ నాయకులు వాడే బాష చాలా ఘోరంగా ఉంది

### ప్రతిపక్ష,అధికార పక్షాలు తప్పుడు బాషను వాడి ప్రజల ఈసరింపుకు గురి కావొద్దు

### శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

నల్లగొండ,జూలై 21(వార్త వేదిక సూర్య):
రాజకీయ నాయకులు వాడే బాష చాలా ఘోరంగా ఉందని, ప్రతిపక్ష,అధికార పక్షాలు తప్పుడు బాషను వాడి ప్రజల ఈసరింపుకు గురి కావొద్దని, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు. సోమవారం నల్లగొండలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గుత్తా మాట్లాడుతూ, నాగార్జున సాగర్ ఆయకట్టుకు పది రోజుల ముందుగానే నీటి విడుదల చేయడం శుభ పరిణామం అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రికి ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి ధన్యవాదాలు తెలియజేశారు.

రాజ్యాంగ పదవులను గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాజకీయ నాయకులు గెలిపే లక్ష్యంగా ఎన్నికలలో వేల కోట్లు డబ్బులు ఖర్చుపెడుతున్నారని. దింతో అన్ని రాష్ట్రాల్లో అవినీతి పెరిగిపోతుందని, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే ఉచితాలను కూడా




నియంత్రించాలన్నారు. తెలంగాణ లో పనులు చేసేవారు లేక ఇతర రాష్ట్రాల వ్యక్తులు అన్ని పనులలో ఎక్కువగా ఉన్నారని, వ్యవసాయ కూలీలు కూడా భీహార్ లాంటి రాష్ట్రాల నుండి వస్తున్నారని తెలిపారు.ప్రభుత్వ పథకాల కోసం ప్రజలు ఎదురుచూసే పరిస్థితి ఉండొద్దని ఉచితాలు తగ్గించి ప్రజలకు ఉపాధి కల్పించాలన్నారు.

అదేవిధంగా రాజకీయ పార్టీల వైఖరితో అధికారుల్లో అవినీతి పెరిగిం దని జయలలిత, రాజశేఖర్ రెడ్డి లాంటి వాళ్లు కూడా పోయే టప్పుడు ఏమి తీసుకుపోలేదన్నారు. కేంద్రం, ఎన్నికల సంఘం, సుప్రీం కోర్టు, అవినీతిపై ద్రుష్టి సారించి. ఎన్నికల్లో ఖర్చు చేసే విషయంలో కఠిన నిర్ణయం తీసుకోవాలన్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మద్రాస్‌కు నీళ్లు తీసుకుపోవడానికి ప్రాజెక్ట్ ల అనుసంధానం జరిగిందని ఇచ్చంపల్లి నుండి నాగార్జున సాగర్ కు నీళ్లు వస్తే తెలంగాణ కు మేలు జరుగుతుందని బంకనకచర్ల ప్రాజెక్ట్ ను తెలంగాణ గట్టిగా వ్యతిరేకిస్తుందని బంకనచర్ల ద్వారా తెలంగాణ కి నష్టం జరుగుతుందని తెలిపారు. తీన్మార్ మల్లన్న,కల్వ కుంట్ల కవిత పిర్యాదులు అందాయని ఇద్దరు ఎమ్మెల్సీల వ్యవహారం తనకు బాధ కలిగించిందన్నారు.చట్టపరంగా నా కర్తవ్యాన్ని నేను నిర్వహిస్తానని ఇది పెద్దల సభ కాబట్టి గౌరవ సభ్యులు హుందాగా ప్రవర్తించాల్సిన బాధ్యత అందరిపై ఉందని కానీ దానికి భిన్నంగా ప్రవర్తించడం మనసుకి బాధను కలిగిస్తుందన్నా రు.చట్టసభల్లో జరిగితే ఒక విధంగా బయట జరుగుతే ఇంకో విధంగా ఉంటుందని వ్యక్తిగత దూషణలకు, దాడులకు పాల్పడడం మంచి సంస్కృతి కాదని ఇటువంటి కార్యచరణ పెద్దల సభకు గౌరవం తగ్గించడం వంటిదనిఎవరు కంప్లైంట్ ఇచ్చిన చట్ట పరిధిలో చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు.






## చాట్ల వెంకటయ్య కుటుంబ సభ్యులను పరామర్శించిన పిసిసి సభ్యులుప పి ఏ సీ ఎస్ నరసింహారెడ్డి

**దేవరకొండ, జూలై 21(వార్త వేదిక సూర్య):** సోమవారం చందంపేట మండలంలోని చిత్రియాల గ్రామానికీ చెందిన చాట్ల వెంకటయ్య మృతి చెందిన విషయం తెలుసున్న పీసీసీ సభ్యులు పిఎసిఎస్ చైర్మన్ జాలే నరసింహా రెడ్డి ఆయన అందుబాటులో లేని కారణంగా ఫోన్ లో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి భరోసా కల్పించి మాజీ ఉప సర్పంచ్ యాదయ్య ద్వారా దహన సంస్కారాల నిమిత్తం 10,000రూ,, అక్షరాల పదివేల రూపాయలు ఆర్థిక సహాయం పంపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు వెంకటయ్య, డైరెక్టర్ అంకుల్, డీలర్ శంకర్, పోలగొని వెంకటయ్య, బోయపల్లి వెంకటయ్య, నారయ్య, యువజన కాంగ్రెస్ నాయకులు మద్ది మడుగు కృష్ణ, దూల్ల వెంకటయ్య,చాట్ల ఆంజనేయులు, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎమ్మెల్యే చేతుల మీదుగా రేషన్ కార్డుల పంపిణీ

- తహసిల్దార్ వీరాబాయి



**చౌటుప్పల్, జూలై 21 (వార్త వేదిక సూర్య):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఈనెల 22వ తేదీన చౌటుప్పల్ లోని బి ఆర్ కే కన్వెన్షన్ హాల్లో నిర్వహించడం జరుగుతుందని తహసిల్దార్ వీరాబాయి తెలిపారు. ఈ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హాజరవుతున్నారని ఆయన చేతుల మీదుగా రేషన్ కార్డుల పంపిణీ జరుగుతుందని ఆమె తెలిపారు. చౌటుప్పల్ మున్సి పాలిటీలోని వివిధ వార్డులకు చెందిన లబ్ధిదారులకు చౌటుప్పల్ లోని బి ఆర్ కే కన్వెన్షన్ హాల్లో ఉదయం 10 గంటలకు నూతన రేషన్ కార్డులు, ఎన్ ఎఫ్ బి ఎస్ పంపిణీ చేయడం జరుగుతుందని, అదేవిధంగా మండలంలోని అన్ని గ్రామాలలో కూడా గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద నూతన రేషన్ కార్డులను పంపిణీ చేయడం జరుగుతుందని, ఈ కార్యక్రమాలలో లబ్దిదారులందరూ పాల్గొని నూతన రేషన్ కార్డులను పొందాలని, ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని తాహసిల్దార్ వీరబాయి కోరారు.

## ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పనులు ప్రారంభం

**చౌటుప్పల్, జూలై 21 (వార్త వేదిక సూర్య):**
చౌటుప్పల్ మున్సిపల్ 10వ వార్డు బిసి కాలనీలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధి దారుడు చింతల మమత మహేందర్ దంపతులు ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పనులు ప్రారంభించారు.



ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, పదో వార్డు మాజీ కౌన్సిలర్ బొడిగె అరుణ బాలకృష్ణ గౌడ్, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుర్వి నరసింహ, పార్టీ నాయకులు మొగుదాల రమేష్ గౌడ్, దేప రాజు, పోలోజు శ్రీనివాసాచారి, మహమ్మద్ చాంద్ పాషా, రాపర్తి సైదులు, భాస్కర్, ఎండి ఆజం తదితరులు పాల్గొన్నారు.

## మరణించిన వ్యక్తి కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేత..

**తుర్కపల్లి,జూలై 21 (వార్త వేదిక సూర్య):**
తుర్కపల్లి మండలం గంధమల్ల గ్రామానికి చెందిన బొత్త వెంకటేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు బొత్త రాములు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన బొందుగుల సత్యనారాయణ మరణించడంతో వారి కుటుంబానికి



50 కిలోల బియ్యాన్ని వారి కుటుంబ సభ్యులు బొందుగుల యాదగిరికి అందజేశారు. ఈ కార్యక్రమంలో గంధమల కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఉపాధ్యక్షులు శాగరాజు,గడిపే సత్యనారాయణ ,శాగ కనకరాజు, శాగ రామచందర్, మాడిశెట్టి సురేందర్, ఇటికాల బాల్నర్స్,శాగ మల్లయ్య, గడిపే సత్యనారాయణ, శాగ లింగయ్య, పాల్గొన్నారు.

# 23న జరిగే తెలంగాణ రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

**భువనగిరి, జూలై 21 (వార్త వేదిక సూర్య):**
సోమవారం రోజున స్థానిక బి. సి బాలురు కళాశాల హాస్టల్ లో భువనగిరి పట్టణ కమిటీ సమావేశం భువనగిరి పట్టణ కార్యదర్శి ఈర్ల రాహుల్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా SFI జిల్లా అధ్యక్షుడు చింతల శివ హాజరైయ్యారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక విధానాలు, ప్రజా వ్యతిరేక విధానాలు తీసుకోడం కారణంగా అధికారాన్ని కోల్పోయింది. గత ప్రభుత్వాని గద్దె దించే పోరాటల్లో ఈ SFI విద్యార్థి సంఘం ప్రధాన పాత్ర పోషించాయి. గత ప్రభుత్వం చేసిన తప్పిదలు మేము చేయము పేద విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజు బకాయిలను పెండింగ్ పెట్టకుండా ఎప్పటికప్పుడు చెల్లిస్తామని, విద్య రంగానికి 15% నిధులు కేటాయిస్తామని, నిరుద్యోగ సమస్య తీరుస్తామని తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలనా అందిస్తామని అధికారంలోకి వచ్చిన ఈ రేవంత్ రెడ్డి సర్కార్ 2 సంవత్సరలు గడుస్తున్న కూడ ఇప్పటి వరకు పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ పీజు రియాంబర్స్ బకాయిలను విడుదల చేయకపొగ




కనీసం విద్యా రంగం ఎదురకొంటున్న సమస్యలపై ఒక సమీక్షా నిర్వహించకుండా ఇప్పటివరకు విద్యా శాఖ మంత్రిని నియమించకుండా, ప్రభుత్వ విద్యను ధ్వంసం చేస్తూ ప్రవేట్ కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తూ విచ్చలవిడిగా ప్రవేట్ యూనివర్సిటీలకు అనుమతులిస్తూ పేద, మధ్య తరగతి విద్యార్థులను విద్యకు దూరం చేసే కుట్రకు తెరలేపుతూన్నారు. ప్రజా పాలనా అని మాటల్లో చెప్పు తూ, ఆచరణలో అప్రజాస్వామ్య పాలనా కొనసాగుతుందన్నారు.

ఇచ్చిన ఆరు గ్యారంటీలు గాలికి వదిలేసి ప్రశ్నించే వారిపైన అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. ఒకవైపు తీరు రేవంత్ రెడ్డి చేతగాని తనానికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను అమలు చేస్తూ,ఎలాంటి పెండింగ్ బకాయిలు పెట్టకుండా,విద్య రంగంలో ఉన్నా అన్ని ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తూ,ఫీజు నియంత్రనా చట్టం తీసుకురావాలి. విద్యార్థులందరికి ఉచిత బస్సు పాసులు ఇవ్వాలని మరియు జాతీయ నూతన విద్య విధానాన్ని రద్దు చేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలనీ డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 23 న తలపెట్టిన విద్య సంస్థల బంద్ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని బంద్‌ను విజవంతం చేయాలని పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమం జిల్లా కమిటీ సభ్యులు ఈర్ల కార్తీక్, భవాని శంకర్, హాస్టల్ కమిటీ అధ్యక్షుడు సతీష్, అభినవ్, వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు

# సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం: మార్కెట్ చైర్మన్ వెంకటయ్య

**చౌటుప్పల్, జూలై 21 (వార్త వేదిక సూర్య):**
సీఎం రిలీఫ్ పండ్ పేద ప్రజలకు వరమని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య తెలిపారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని లక్కారం క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సొప్పరి యాదయ్య కు వైద్య ఖర్చుల కోసం మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో మంజూరైన రూ. 2.50 లక్షల ఎల్ఓసి చెక్కును మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య చేతుల మీదుగా బాధితునికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు బోయ దేవేందర్, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు సుర్వి నరసింహ, పార్టీ సీనియర్ నాయకులు మోగదాల రమేష్ గౌడ్, బక్క శ్రీనాథ్, వీరమల్ల సత్తయ్య, సురకంటి బాలకృష్ణరెడ్డి పాలకూరల సాయికిషోర్ తదితరులు పాల్గొన్నారు.








# దేవరకొండలో కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం

### పాల్గొన్న స్థానిక శాసన సభ్యులు నేనావత్ బాలునాయక్

**దేవరకొండ జూలై 21(వార్త వేదిక సూర్య):**
దేవరకొండ పట్టణంలోని పి పి ఆర్ కన్వెన్షన్ హాల్లో జరిగిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో శాసన సభ్యులు నేనావత్ బాలునాయక్ తో పాటు కాంగ్రెస్ పార్టీ నల్లగొండ జిల్లా ఇన్చార్జి ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ ఎమ్మెల్సీ శంకర్ నాయక్ నియోజకవర్గ అన్ని మండల పార్టీ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మాజీ జెడ్పిటిసిలు, ఎంపీపీలు మరియు ముఖ్య కార్యకర్తలు పాల్గొనడం జరిగింది ఈ కార్యక్రమంలో దేవరకొండ శాసనసభ్యులు బాలు నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల ప్రకారం ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం, వరి ధాన్యం క్వింటాలుకి 500 రూపాయల బోనస్, రైతు రుణమాఫీ, రైతు భరోసా లాంటి వివిధ పథకాలు ఇప్పటికే ప్రజలకు అందించామని ఇంకా మరిన్ని కార్యక్రమాలు చేస్తుందని తెలియజేశారు. అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ ఏ అభ్యర్థిని ఎంపిక చేస్తుందో అందరూ కలిసి ఆ అభ్యర్థిని గెలిపించే బాధ్యత ప్రతి ఒక్క కాంగ్రెస్ పార్టీ కార్యకర్త పైన ఉందని అన్నారు అవకాశాలు రాని నాయకులకు ఏదో ఒక విధంగా కాంగ్రెస్ పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందని, ప్రతి కార్యకర్తను కాపాడుకునే బాధ్యత నా పైన ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామ పంచాయతీల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.



# సినీ వార్తలు

## మండుటెండల్లో 53రోజులు క్లైమాక్స్ షూటింగ్

మెగా సూర్య ప్రొడక్షన్ బ్యానర్‌పై ఏఎం రత్నం నిర్మాణంలో తెరకెక్కిన పీరియాడికల్ యాక్షన్ మూవీ 'హరిహర వీరమల్లు' చిత్రం జులై 24న విడుదల కాను



న్నది. ఐదేళ్లుగా షూటింగ్ జరుపుకుంది. ఇక సినిమా రిలీజ్ అవుతున్న నేపథ్యంలో హీరోయిన్ నిధి అగర్వాల్ , నిర్మాత ఏఎం రత్నం వరుస ప్రమోషన్లు చేసారు. అయితే తనకెంతో ఇష్టమైన నిర్మాత ఏఎం రత్నం కోసం పవన్ కళ్యాణ్ తన పాత పంథాని పక్కన పెట్టుకుని చాన్నాళ్ల తర్వాత మీడియా ముందుకు రావడం విశేషం. ప్రెస్‌మీట్‌లో తన మనసులోని భావాలను పంచుకు న్నారు. హరిహర వీరమల్లు సినిమాకు సంబంధించిన అనేక అంశాలను ప్రస్తావించిన ఆయన, ఈ ప్రాజెక్ట్ పట్ల తన కమిట్‌మెంట్, ఇండస్ట్రీపై తన ప్రేమను మరోసారి చాటారు. సినిమా బతకాలి‘ అన్న ఒక్క ఉద్దేశంతోనే ఈ ప్రెస్‌మీట్ ఏర్పాటు చేశానని పవన్ స్పష్టం చేశారు. ప్రీరిలీజ్ తర్వాత ఈ అవకాశం దక్కుతుందో లేదో తెలియక, తన మనసులోని భావాలను పంచుకోవాలని అనిపించిందన్నారు. ఈ సినిమా ఎంతో క్లిష్ట పరిస్థితుల్లో సాగిందని పవన్ తెలిపారు. కరోనా విజృంభించిన సమయంలో, షూటింగ్ స్తంభించడంతో పాటు పలు సాంకేతిక, ఆర్థిక సమస్యలు ఎదురయ్యాయన్నారు. దర్శకుడు క్రిష్, రచయిత సాయిమాధవ్ బుర్రా తపన చూసి, రాజకీయాల్లో బిజీగా ఉన్నప్పటికీ, సినిమా పూర్తి చేయాలని నిర్ణయించుకున్నానన్నారు. మండుటెండల్లో 57 రోజులు క్లైమామామాక్స్ షూట్ చేశాం. చాలా కాలం తర్వాత మళ్లీ మార్షల్ ఆర్ట్స్ ప్రాక్టీస్ చేశా. ఈ సినిమా ళ్ల÷కెమాక్స్ సీన్లు అందరికీ ప్రేరణ కలిగిస్తాయి అని పవన్ చెప్పుకొచ్చారు. ఈ సినిమా కోసం నిర్మాత ఎదుర్కొన్న కష్టాలను చూసి, తన వంతు బాధ్యతగా ఈ సినిమాను చేయాలని భావించానని పవన్ తెలిపారు.

నిర్మాత కనుమరుగు కాకూడదు అనే ఉద్దేశంతో నాపై నాకున్న గౌరవంతో, ఇండస్ట్రీపై ప్రేమతో ఈ సినిమాను చేశా అన్నారు. మూవీకి కీరవాణిగారి సంగీతమే ప్రాణం పోసింది,‘ అంటూ పవన్ కృతజ్ఞతలు తెలిపారు. నన్ను చాలా మంది విమర్శిస్తున్నారు. కానీ నన్ను అన్నం పెట్టిన ఇండస్ట్రీని మర్చిపోలేను. సినిమాపై గౌరవం గల వ్యక్తిగా, ఈ సినిమా కోసం మీ ముందుకు వచ్చాను అని పవన్ కళ్యాణ్ భావోద్వేగంగా చెప్పారు.ఇక నిధి ఈ సినిమా కోసం పడ్డ కష్టం చూసి నాకే సిగ్గుగా అనిపించిందని పవన్ అన్నారు.

## వీరమల్లు మూవీ కోసం చాలా కష్టపడ్డాం..

**- పవన్ కళ్యాణ్**

పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ ఫిల్మ్ 'హరి హర వీరమల్లు' మూవీ జులై 24న పాన్‌ఇండియా స్థాయిలో విడుదల కానుంది. ఈసందర్భంగా టీమ్ స్పెషల్ ప్రెస్‌మీట్ నిర్వహించింది. ఇందులో పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. పోడియం లేకుండా మాట్లాడటం కష్టంగా ఉందని నవ్వుతూ పవన్ తన స్పీచ్‌ను ప్రారంభించారు. నా జీవితంలో సినిమాపరంగా మీడియాతో మాట్లాడడం ఇదే తొలిసారి. సినిమాను ఎలా ప్రమోట్ చేసుకోవాలో నాకు తెలియదు. దీనికోసం ఇంత కష్టపడ్డాం అని చెప్పడం నాకు మొహమాటంగా ఉంటుంది. నేను ఇండస్ట్రీక్రి వచ్చిన కొత్తలో నా ఫొటోలు కూడా పేపర్లో వేయలేదు. దీంతో పబ్లిసిటీ లేకుండానే నా సినిమాలు రిలీజ్ అయ్యాయి. సినిమా గురించి నాకు ఏం మాట్లాడాలో తెలియదు. . సినిమాను తెరకెక్కించాలంటే ఎన్నో యుద్ధాలు చేయాలి. మన చిత్ర పరిశ్రమని పాన్‌ఇండియా స్థాయికి తీసుకువెళ్లిన వ్యక్తి రత్నం. ఈ సినిమా చాలా ఒడుదొడుకులు ఎదుర్కొంది. నేను పాలిటిక్స్‌కు వెళ్లిపోయిన తర్వాత సినిమాకు టైం ఇవ్వలేకపోయాను. అయినప్పటికీ నా బెస్ట్ ఇచ్చాను. గతంలో నేను నేర్చుకున్న మార్షల్‌ఆర్ట్స్ ఈ సినిమాకు ఎంతో పనికి వచ్చిందని పవన్ వివరించారు. ఈ సినిమాకు క్లైమాక్స్ ఆయువుపట్టు. కోహినూర్ వజ్రం చుట్టూ కథ తిరుగుతుంది. క్రిష్ చాలా మంచి కాన్సెప్ట్‌తో ముందుకు వచ్చారు. ఆయనకు మా టీమ్ అందరి తరఫున కృతజ్ఞతలు. ఒక్కోసారి ఇండస్ట్రీ చాలా కఠినంగా ఉంటుంది. రత్నం ఎంతో ముందుచూపు ఉన్న నిర్మాత. ఆయన ఈ సినిమా కోసం ఎంతో నలిగిపోయారు. ఈ సినిమా పూర్తవుతుందా, లేదా అని అనుకున్నప్పుడు దీనికి కీరవాణి ప్రాణం పోశారు. ఒక్కోసారి డబ్బులు, సక్సెస్ కోసం కాదు ఇండస్ట్రీ బాగుకోరే వ్యక్తుల వెంట నిలవడం ఎంతో ముఖ్యం. అందుకే ప్రత్యర్థులు తిడుతున్నా ఈ మీటింగ్‌కు వచ్చాను. ఫిల్మ్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు ఛైర్మన్‌గా రత్నం పేరును ప్రతిపాదించాను. నాకు సినిమా అన్నం పెట్టింది. సినిమా అంటే నాకు ప్రాణవాయువుతో సమానం అని పవన్ తెలిపారు.



మన ప్రభుత్వం చిత్రపరిశ్రమను ఎంతో ఆదరిస్తోంది. అందుకే ఈ సినిమా ప్రచారంలో భాగం కావాలని వచ్చాను. చిరంజీవి కుమారుడైనా, తమ్ముడైనా ఎవరైనా టాలెంట్ లేకపోతే నిలబడలేరు. రేపు నా కుమారుడైనా అంతే. ఇక్కడ ప్రతిభే ముఖ్యం అని పవన్ పేర్కొన్నారు. ఈ సినిమా కోసం తెల్లవారుజామున 2 గంటలకు లేచి కష్టపడేవాడిని. జ్యోతికృష్ణ ఎంతో సత్తా ఉన్న దర్శకుడు. ఈ సినిమా ఫలితం పూర్తిగా ప్రజల చేతిలో ఉంటుంది. మిగతా వారితో పోలిస్తే నేను కొన్ని పనులు చేయలేను. సుస్వాగతం సినిమాలో బస్సు మీద ఎక్కి డ్యాన్స్ చేయమన్నారు. నేను చేయలేక చచ్చిపోయా. యాక్షన్ సీక్వెన్స్ కూడా మార్షల్ ఆర్ట్స్ చేశా కాబట్టి అవగాహన ఉంది. టాలీవుడ్, బాలీవుడ్, కోలీవుడ్ అని వేరు చేయడం నాకు నచ్చదని పవన్ అన్నారు. ఈ సినిమాలో 20 నిమిషాల ఫైట్ సన్నివేశానికి పవన్‌కల్యాణ్ కొరియోగ్రఫీ చేశారని దర్శకుడు జ్యోతికృష్ణ చెప్పారు. పవన్‌తో నటించే అవకాశం రావడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు నటి నిధి అగర్వాల్ అన్నారు.

## లక్కీ భాస్కర్ అనుకున్న విజయం సాధించలేదు

**- నిర్మాత నాగవంశీ వెల్లడి**


విజయ్ దేవరకొండ ప్రధాన పాత్రలో నటించిన 'కింగ్‌డమ్' సినిమా జూలై 31న విడుదల కానుంది. ఈ చిత్రాన్ని గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. ప్రస్తుతం ప్రమోషన్లలో బిజీగా ఉన్న నిర్మాత నాగవంశీ, తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన గత చిత్రాల ఫ్లాప్‌ల గురించి ఓపెన్ అయ్యారు. నాగ వంశీ మాట్లాడుతూ.. ' 'లక్కీ భాస్కర్' సినిమాకు నేను ఊహించినంత వసూళ్లు రాలేదు. అలాగే 'గుంటూరు కారం'పై వచ్చిన ట్రోలింగ్ నాకు ఇంకా అర్థం కావడం లేదు. కానీ నేను తెలిసి చేసిన తప్పు 'రణరంగం'. శర్వానంద్ లవర్ బాయ్ ఇమేజ్ ఉన్న సమయంలో వయసున్న పాత్ర చేయించడం అంత మంచిదేం కాదు అని బాబాయ్ హెచ్చరించారు. అయినా మేము కొత్తగా ప్రయత్నించాలనుకున్నాం. అది వర్కౌట్ కాలేదు. కానీ అది పూర్తిగా ఫెయిల్ అయింది. బహుశా ఆ పాత్రను రవితేజ వంటి వాళ్లు చేసిన, హిట్ అయ్యేదేమో. అలాగే 'ఆదికేశవ' సినిమా విషయంలో కూడా



పెద్ద తప్పు చేశా. రిపేర్ చేయాలని ప్రయత్నించిన కుదర్లేదు. ఈ రెండు సినిమాలు నా కెరీర్‌లో చాలా ఖరీదైన తప్పులుగా మిగిలిపోయాయి' అని ఆయన గుర్తు చేసుకున్నారు. తన తప్పులను నిస్సందేహంగా అంగీకరించి, తద్వారా భవిష్యత్తులో మంచి నిర్ణయాలు తీసుకోవాలన్న ప్రయత్నం చేస్తున్న నాగవంశీ మాటలు ఇప్పుడు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారాయి. అభిమానులు, సినీ వర్గాలు ఆయన నిజాయతీని మెచ్చుకుంటున్నారు.

## పెద్ది మూవీ కోసం రామ్ చరణ్ కసరత్తులు

రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'పెద్ది' సినిమా కోసం అభిమానులతో పాటు సినీ ప్రియులంతా ఎదురుచూస్తున్నారు. ఇందులో చరణ్ డిఫరెంట్ లుక్‌లో కనిపించనున్నారు. ఇప్పటికే రిలీజైన పోస్టర్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ సినిమా కోసం తాను వర్క్‌వుట్స్



చేస్తున్నట్లు తెలుపుతూ రామ్‌చరణ్ ఓ ఫొటో షేర్ చేశారు. ప్రస్తుతం అది వైరల్ అవుతోంది. జిమ్‌లో వర్క్‌వుట్స్ చేస్తోన్న ఫొటోను షేర్ చేసిన ఆయన ..'పెద్ది కోసం మారుతున్నాను ఇలా.. దృఢమైన సంకల్పం.. గొప్ప ఆనందం‘ అనే క్యాప్షన్ పెట్టారు. దీంతో ఆయన న్యూలుక్ ఫొటోను అభిమానులు షేర్ చేస్తున్నారు. ఇప్పటికే ఈ 'పెద్ది' గ్లింప్స్‌లోని కొన్ని సన్నివేశాలతోనే పాన్ ఇండియా స్థాయిలో సినిమాపై ప్రత్యేకమైన ఉత్సుకతని రేకెత్తించింది చిత్రబృందం. అందుకు దీటుగానే బుచ్చిబాబు సినిమాని రూపొందిస్తున్నారు. తాజాగా చెర్రీ లుక్‌తో ఆ అంచనాలు మరింత పెరిగాయి.

# స్పోర్ట్స్ | SPORTS

## బీసీసీఐ ప్రెసిడెంట్ రేసులో ఆ ఇద్దరు

బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీకి జులై 19తో 70ఏళ్లు నిండాయి. దీంతో బోర్డు రాజ్యాంగం ప్రకారం గరిష్ఠ వయో పరిమితి దాటడంతో బిన్నీ తన పదవికి అనర్హుడువుతారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ లో జరిగే వార్షిక సర్వసభ్య సాధారణ సమావేశం..వరకు బిన్నీ కొనసాగుతాడా లేదా ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లాకు తాత్కాలికంగా బాధ్యతలు అప్పగించి ఆయన తప్పుకుంటాడా అనే విషయంపై ఇప్పుడు



ఉత్కంఠ నెలకొంది. అంతేకాదు జాతీయ క్రీడా బిల్లు ముసాయిదా రూపంలో మరో ట్విస్ట్ బిన్నీకి అనుకూలంగా మారే ఛాన్స్ కనిపిస్తోంది. సోమవారం నుంచి జరిగే పార్ల మెంట్ సమావేశాల్లో నూతన క్రీడా బిల్లును ప్రవేశపెడతారు. ఈ డ్రాఫ్ట్ ప్రకారం పాలకుల వయోపరిమితిని 70 నుంచి 75ఏళ్లకు పెంచాలని ప్రతిపాదించారు. ఒకవేళ ఈ బిల్లు ఆమోదం పొందినట్లయితే..జాతీయ క్రీడా సమాఖ్యలకు అన్నింటికీ ఈ నిబంధన వర్తిస్తుంది.బీసీసీఐ కూడా ఎన్ఎస్ఎఫ్ కావడంతో చట్టం ప్రకారం నడుచుకోవాల్సిందే. అంతర్జాతీయ క్రికెట్ మండలి నిబంధనల్లో కూడా ఎక్కడా వయోపరిమితులను విధించలేదు. ఇలా చూస్తే బోర్డు అధ్యక్షుడిగా బిన్నీ మరో 5ఏళ్లు కొనసాగే అవకాశం ఉంటుంది.

ఇదే విషయంపై బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా, న్యాయనిపుణులతో బిన్నీ ఈపాటికే చర్చించినట్లు తెలుస్తోంది. మరోవైపు బోర్డులో చక్రం తిప్పగల పెద్దలు కూడా మరో 3ఏళ్లు బిన్నీనే కొనసాగించాలని భావిస్తున్నారట. కొందరు మాత్రం కొత్త బిల్లు వచ్చేంత వరకు శుక్లాకు తాత్కాలిక బాధ్యతలు అప్పగించాలనుకుంటున్నారట.

## మరో ఆసక్తికర పోరుకు టీమిండియా సిద్ధం

**మాంచెస్టర్ వేదికగా నేటినుండి నాలుగో టెస్ట్**

**ఇంగ్లండ్‌తో అమీతుమీ తేల్చుకోనున్న భారత్**

ఇంగ్లండ్‌తో ఐదు టెస్ట్‌ల అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీలో 1-2తో వెనుకంజలో నిలిచిన టీమిండియా.. మరో ఆసక్తికర పోరుకు సిద్ధమైంది. బుధవారం నుంచి మాంచెస్టర్ వేదికగా జరిగే నాలుగో టెస్ట్‌లో ఆతిథ్య ఇంగ్లండ్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. 11 ఏళ్ల తర్వాత మాంచెస్టర్ వేదికగా టీమిండియా టెస్ట్ మ్యాచ్ ఆడుతుంది. ఈ సిరీస్ ఆశలు సజీవంగా ఉండాలంటే విజయం సాధిస్తే 89 ఏళ్ల నిరీక్షణకు తెరపడనుంది. 1936లో మహరాజ కెప్టెన్సీలో భారత్ మాంచెస్టర్‌లో టీమిండియా తొలి మ్యాచ్ ఆడింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్కటి గెలవలేదు. నాలుగో టెస్ట్‌లోనూ టీమిండియా ఓటమిపాలైతే.. ఒకే వేదికగా 10 ప్లస్ మ్యాచ్‌లు ఆడి ఒక విజయం సాధించిన జట్టుగా అప్రతిష్టను మూటగట్టుకుంటుంది. ప్రస్తుతం భారత్ మాంచెస్టర్‌తో పాటు బార్బోడస్ వేదికగా తొమ్మిదేసి మ్యాచ్‌లు ఆడి ఒక్క విజయం సాధించలేదు. మరే జట్టు కూడా ఇలాంటి ఫీట్ నమోదు చేయలేదు. ఈ జాబితాలో



ఈ మ్యాచ్‌లో టీమిండియా విజయం సాధించడం కీలకం. ఓడినా.. డ్రా అయినా సిరీస్ గెలిచే అవకాశాలను టీమిండియా కోల్పోతుంది. ఇంగ్లండ్ గడ్డపై టెస్ట్ సిరీస్ విజయం కోసం టీమిండియా గత 18 ఏళ్లుగా నిరీక్షిస్తోంది. 2007లో చివరిసారిగా భారత్.. ఇంగ్లండ్ గడ్డపై టెస్ట్ సిరీస్ గెలిచింది. అయితే మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో భారత్‌కు మెరుగైన రికార్డ్స్ లేవు. ఈ మైదానంలో భారత్ ఇప్పటి వరకు ఒక్క మ్యాచ్ కూడా గెలవలేదు. మొత్తం 9 మ్యాచ్‌లు ఆడిన భారత్ ఐదు మ్యాచ్‌లు డ్రా చేసుకొని నాలుగింటిలో ఓడింది. ఈ మ్యాచ్‌లో టీమిండియా ప్రస్తుతం ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, శ్రీలంక భారత్‌తో సమంగా ఉన్నాయి. ఆస్ట్రేలియా.. కరాచీ వేదికగా 9 మ్యాచ్‌లు ఆడి ఐదింటిలో ఓడి 4 డ్రా చేసుకుంది. బంగ్లాదేశ్ డాకా వేదికగా 9 మ్యాచ్‌లు ఆడి ఏడింటిలో ఓడి 2 డ్రా చేసుకుంది. బార్బోడస్‌లో భారత్ 9 మ్యాచ్‌లు ఆడి ఏడింటిలో ఓడి 2 డ్రా చేసుకుంది. మాంచెస్టర్‌లో భారత్ 9 మ్యాచ్‌లు ఆడి నాలుగింటిలో ఓడటంతో పాటు ఐదింటిలో ఓటమి తప్పించుకుంది. శ్రీలంక లండన్ వేదికగా 9 మ్యాచ్‌లు ఆడి మూడింటిలో ఓడి 6 డ్రా చేసుకుంది.

## టీమిండియాకు గాయాల బెడద

ఇంగ్లాండ్ పర్యటనలో టీమిండియా ప్లేయర్లు గాయాల బెడద వెంటాడుతోంది. ఇప్పటికే టెస్ట్ సిరీస్‌లో 2-1 తేడాతో వెనుకబడిన భారత్‌కు స్టార్ ప్లేయర్ల గాయాలపాలు కావడం మరింత ఆందోళనకు గురిచేస్తోంది. టెస్ట్‌ల్లో అరంగేట్రం కోసం చూస్తున్న అర్ష్‌దీప్ సింగ్ ప్రాక్టీస్ సెషన్‌లో బౌలింగ్ చేస్తుండగా.. చేతికి గాయమైనట్లు తెలుస్తోంది. స్టార్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి కూడా గాయపడినట్లు సమాచారం. ఆదివారం జిమ్‌లో కసరత్తులు చేస్తున్న సమయంలో లిగమెంట్ దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. దీంతో అర్ధరాంతరంగా భారత్‌కు వస్తున్నట్లు చెబుతున్నారు. ఈ సిరీస్‌లో రెండు టెస్టులు ఆడిన నితీశ్ కుమార్ రెడ్డి.. బౌలింగ్‌లో మూడు వికెట్లు తీయగా, బ్యాటింగ్‌లో 45 పరుగులు చేశాడు. ముఖ్యంగా మూడో టెస్ట్‌లో మంచి ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. బౌలింగ్‌లో కీలక వికెట్లు తీయడంతోపాటు బ్యాటింగ్‌లో పర్వాలేదనిపించాడు. ఈ నేపథ్యంలోనే అన్షుల్ కాంబోజ్‌కు బీసీసీఐ పిలుపునిచ్చింది. మరోవైపు రెండో టెస్ట్‌లో అదరగొట్టిన ఆకాశ్‌దీప్ సైతం గాయపడినట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో నాలుగో టెస్ట్‌లో అతడు ఆడేది అనుమానంగా మారింది. ఈ ముగ్గురి ప్లేయర్ల గాయాల గురించి బీసీసీఐ ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. పనిభారం కారణంగా జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్‌కు విశ్రాంతినివ్వాలని డిమాండ్లు వస్తున్న నేపథ్యంలో కీలక ఆటగాళ్ల గాయాలు తలనొప్పిగా మారాయి. ఇప్పటికే మూడో టెస్ట్‌లో గాయపడిన రిషభ్‌పంత్ ఇంకా పూర్తి కోలులేదని సమాచారం. నాలుగో టెస్ట్‌లో స్పెషలిస్ట్ బ్యాటర్‌గా దిగుతాడని చెబుతున్నారు. కరుణ్ నాయర్ వరుసగా



మూడు టెస్ట్‌ల్లో విఫలం కావడంతో సాయిసుదర్శన్ లేదా అభిమాన్యు ఈశ్వరన్‌ను తుది జట్టులో తీసుకోవాలని మాజీలు సూచిస్తున్నారు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ లేకపోవడంతో ఈ సిరీస్ ప్రారంభానికి ముందు ఇంగ్లాండ్ ముందు భారత్ కనీసం నిలుస్తుందా.. అని అందరూ అనుమానం వ్యక్తం చేశారు. అయితే ఈ అనుమానాలన్ని పటాపంచల్ చేస్తూ తొలి టెస్ట్‌లోనే టీమిండియా అదరగొట్టింది. గెలుపు అవకాశాలను సృష్టించుకుని.. నాలుగు రోజులు ఆధిపత్యం చెలాయించి చివరి రోజూ అనూహ్యంగా ఓటమిపాలైంది. ఇక రెండో టెస్ట్‌లో ఇంగ్లాండ్‌కు చుక్కలు చూపిస్తూ.. భారీ తేడాతో విజయం సాధించింది.మూడోటెస్ట్‌లోనూ అద్భుతంగా పోరాడింది. గెలుపు అంచుల వరకు వచ్చి.. చివరకు 22 పరుగుల తేడాతో ఓడిపోయింది. దీంతో సిరీస్‌లో నిలవాలంటే నాలుగో టెస్ట్‌లో భారత్ కచ్చితంగా గెలిచి తీరాల్సిందే. ఇలాంటి తరుణంలో ఆటగాళ్ల గాయాలు కావడంతో తుది జట్టు ఎలా ఉంటుందని ఉత్కంఠ నెలకొంది. బ్యాటింగ్ వరకు పెద్దగా సమస్యలు లేకపోయినా.. బౌలింగ్‌లో ఎవరిని తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది. మాంచెస్టర్ వేదికగా ఈ నెల 23వ తేదీ నుంచి నాలుగో టెస్ట్ మొదలుకానుంది.

Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**,and **Printed at SURYA DIGITAL PRINTERS,** H.No.132, Markondeya Nagar, Choutuppal Municipality, YadadriBhuvanagiri District, Telangana State508252., and Published at H.No. 132, Markondeya Nagar, Choutuppal Municipality, YadadriBhuvanagiri District, Telangana State508252. **Editor: POLOJU SRINIVASA CHARY. RNI No: TGTEL/25/A0305,** Cell:9985389183. **Email Id:vaarthavedhikasurya2025@gmail.com**